పెద్దిరెడ్డి వర్గాన్నే టార్గెట్ చేశారా!

- కుప్పం వైసీపీలో పెరుగుతున్న ధిక్కార స్వరం
- సస్పెన్షన్లతో ఉడికిపోతున్న ఎమ్మెల్సీ భరత్ వ్యతిరేక వర్గం


సర్దార్ బాషా

కుప్పం, మే 13 (ఆంధ్రజ్యోతి):కుప్పం వైసీపీలో ధిక్కార స్వరాలు పెరుగుతున్నాయి. కొనసాగుతున్న సస్పెన్షన్ల పర్వం ఎమ్మెల్సీ భరత్ వ్యతిరేక వర్గంలో కాక రగిలిస్తోంది. మరోవైపు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వర్గాన్ని టార్గెట్ చేశారన్న అనుమానాలు పార్టీలో బలపడుతున్నాయి. ఒకరొకరే బయటకు వచ్చి వాస్తవాలు బయటపెడుతున్నారు.మొన్నటి ఎమ్మెల్యే ఎన్నికలు, తర్వాత మున్సిపల్ ఎన్నికల్లో తాము పడిన కష్టంతోపాటు డబ్బులు మంచినీళ్లలా ఖర్చయిన వాస్తవాన్ని వీడియోల సాక్షిగా బహిర్గతం చేస్తున్నారు. సస్పెన్షన్‌కు గురైన వైసీపీ నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు, కుప్పం మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు అయిన ఎస్‌కే.సర్దార్‌బాషా మంగళవారం సోషల్ మీడియాలో విడుదల చేసిన వీడియో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ శాంతిపురం జడ్పీటీసీ ఎస్.శ్రీనివాసులు, వసనాడు మాజీ సర్పంచి మురళి, మొరసనపల్లె సర్పంచి జగదీశ్ భార్య నీలావతిలను పార్టీనుంచి సస్పెండు చేస్తూ ఎమ్మెల్సీ భరత్ తన లెటర్ హెడ్‌పై ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ ఆదేశాలు చిన్న స్థాయిలోనే అయినా పార్టీని రెండుగా చీల్చాయి.జడ్పీటీసీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా జరిగిన సమావేశానికి నియోజకవర్గంలోని నాలుగు మండలాలతోపాటు కుప్పం మున్సిపాలిటీనుంచి కూడా పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరవడం,ఎమ్మెల్సీ భరత్ వ్యవహారశైలిపై విరుచుకుపడడం తెలిసిందే. తొలినుంచీ కష్టపడుతున్న తమను పార్టీనుంచి సస్పెండు చేసే అధికారం, అర్హత భరత్‌కు లేవని తెగేసి చెప్పిన సస్పెన్షన్‌కు గురైన వ్యక్తులు, త్వరలోనే అధిష్ఠానానికి ఫిర్యాదు చేసి, భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక ప్రకటిస్తామన్నారు.అయితే భరత్ లెటర్ హెడ్‌లో పేర్కొన్న ముగ్గురితోపాటు ఆ సమావేశానికి హాజరైన వైసీపీ జిల్లా విద్యా విభాగం మాజీ అధ్యక్షుడు చీలేపల్లె రవి, ఆరేళ్ల జయప్ప, కుప్పం మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ ఎస్‌కే.సర్దార్ బాషాతోపాటు 10మంది మున్సిపల్ కౌన్సిలర్లను కూడా పార్టీనుంచి సస్పెండు చేస్తూ మంగళవారం వైసీపీ జిల్లా అధ్యక్షుడు కరుణాకర రెడ్డి వెలువరించిన ఉత్తర్వులు పార్టీలో ఇన్నాళ్లూ అంతర్గతంగా కొనసాగుతున్న విభేదాలను బహిర్గతం చేయడమే కాదు, ధిక్కార స్వరాలను మరింతగా పెంచాయి. సస్పెన్షన్‌కు గురైన సర్దార్ బాషా, ఎమ్మెల్సీ భరత్‌తోపాటు ఏకంగా జిల్లా పార్టీ అధ్యక్షుడు కరుణాకర రెడ్డినే లక్ష్యం చేసుకుని తీవ్రమైన విమర్శలు గుప్పించారు.సామాజిక మాధ్యమాల్లో మంగళవారం ఆయన విడుదల చేసిన వీడియో కుప్పం నియోజకవర్గంలో కలకలం సృష్టించింది. 'మా పెద్దలు రామచంద్రారెడ్డి తన కష్టంతో సంపాదించి తెచ్చిన ధనంనే తెచ్చి ఈడ పెడితే మీరు నాలుగువేల ఓట్లు మాత్రమే సంపాదించినారు.' అని ఆయన చేసిన వ్యాఖ్య ఎమ్మెల్యే ఎన్నికల్లో వైసీపీ వ్యవహరించిన తీరును బహిర్గతం చేస్తోందని విశ్లేషకులంటున్నారు. అంటే 2014 ఎన్నికల్లో అప్పటి వైసీపీ అభ్యర్థి చంద్రమౌళికి వచ్చిన ఓట్లకంటే 2024 ఎన్నికల్లో భరత్‌కు వచ్చిన ఓట్లు కేవలం 4 వేలు మాత్రమే ఎక్కువని చెప్పడమన్నమాట.'ప్రతి కౌన్సిలర్ దగ్గర లక్షలు డిమాండ్ చేసి ఈరోజు మూటగట్టుకున్నాడు' అని ఆయన చేసిన ఇంకో వ్యాఖ్య మున్సిపల్ ఎన్నికల సందర్భంగా నాటి వైసీపీ తీరును, గెలిచిన విధానాన్ని చెప్పకనే చెబుతున్నాయంటున్నారు.ఈ సస్పెన్షన్‌ను ఏమాత్రం యాక్సెప్ట్ చేయబోమని, మిథున్‌రెడ్డి, పెద్దాయన రామచంద్రారెడ్డి చెప్పేంత వరకూ పార్టీలోనే కొనసాగుతామని కూడా సర్దార్ బాషా వీడియోలో స్పష్టం చేశారు.జిల్లా అధ్యక్షుడైన కరుణాకర రెడ్డిని,ఎమ్మెల్సీ భరత్‌ను కానీ ఖాతరు చేయబోమని తెగేసి చెప్పారు.అటు శాంతిపురం జడ్పీటీసీ శ్రీనివాసులు అండ్ కో కూడా ఇదేరకమైన వాదన రెండు రోజుల క్రితంనాటి సమావేశంలో చేశారు. సస్పెన్షన్ల గురించి పెద్దిరెడ్డి దగ్గరే తేల్చుకుంటామన్నారు.ఈ మొత్తం ఎపిసోడ్‌లో సస్పెన్షన్‌కు గురైనవారి వాదనలు వింటూవుంటే కుప్పం నియోజకవర్గంలోని పెద్దిరెడ్డి వర్గంపైనే గురిపెట్టి వేధింపులకు గురి చేస్తున్నారన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఏర్పడింది. మరోవైపు పెద్దిరెడ్డి నుంచి ఈ విషయంలో ఎటువంటి స్పందన లేదు. సస్పెన్షన్లతో కుప్పం వైసీపీలో చోటు చేసుకున్న పరిణామాలు ఎటువైపు దారితీస్తాయోనని పార్టీ అధిష్ఠానం ఆందోళనలో పడిందన్న చర్చ స్థానికంగా జరుగుతోంది.

ఇండస్ట్రియల్ పార్కుకోసం 18.7 ఎకరాల కేటాయింపు

కుప్పం, మే 13 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘ పరిధిలోని పలార్లపల్లెలో ఇండస్ట్రియల్ పార్కుకోసం 18.70 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది.ఈ స్థలంలో వివిధ పరిశ్రమల స్థాపనకోసం అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం త్వరలోనే కల్పించనుంది.

అమ్మవారికి సమర్పించేందుకు తెచ్చిన అంబళ్ల బిందెలతో భక్తులు



మమ్మేలు మాతల్లీ

- కోలాహలంగా నడివీధి గంగజాతర


విశేషాలంకారంలో నడివీధి గంగమ్మ

చిత్తూరు కల్చరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో నడివీధి గంగజాతర మంగళవారం వేకువజామున వైభవంగా ప్రారంభమైంది.అమ్మవారికి తొలిపూజను వంశపారంపర్య ధర్మకర్తలు సీకే బాబు దంపతులు,హేమంత్ కుమార్ నిర్వహించాక భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ దంపతులు పూజలు నిర్వహించారు.అంతకుముందు అమ్మవారి మంగళసూత్రాన్ని సీకే బాబు భార్య లావణ్య భక్తులకు చూపించి అమ్మవారి మెడలో వేశారు. భక్తులకు పసుపు, కుంకుమ, గాజులు, బొందారాలను అందజేశారు. అనంతరం అమ్మవారికి సీకే దంపతులు, ఎమ్మెల్యే గురజాల దంపతులు వింజామరలను సమర్పించారు. ఉత్సవ నిర్వాహకులు వెంకటేష్, ఆర్ఎస్ఎల్ఎస్ సుబ్బు, సీఆర్సీ రవి పాల్గొన్నారు.జాతరలో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు అంబళ్ళు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులతో వేకువజాము నుంచే క్యూలైన్లు నిండిపోయాయి.ఉదయం 10గంటల సమయంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి నడివీధి గంగమ్మను దర్శించుకుని పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, కాజూరు బాలాజీ, ఎస్. చంద్రప్రకాష్ పాల్గొన్నారు.నడివీధి గంగమ్మను ప్రభుత్వ విప్ థామస్ దర్శించుకుని పూజలు చేశారు. గిరింపేట నడివీధి గంగమ్మను మంత్రి, ఎమ్మెల్యే దర్శించుకుని పూజలు చేశారు. వారిని ఉత్సవ నిర్వాహకులు, దుర్గాంబ ఆలయ మాజీ చైర్మన్ వీకే విశ్వనాథ్ తదితరులు సత్కరించారు. జాతరలో భక్తులు కర్పూర హరతులు,నెయ్యి, పిండిదీపాలు, కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పలు ప్రాంతాల్లో భక్తులు మాతంగి వేషాలతో అమ్మవారిని కొలిచారు. అదే విధంగా జానకారపల్లెలో భక్తులు కాళికాదేవి వేషం ధరించి అమ్మవారికి పూజలు చేశారు.గిరింపేట, కొంగారెడ్డిపల్లె, మురకంబట్టు, మంగసముద్రం, సంతపేట, మంగసముద్రం హౌసింగ్ కాలనీ, కట్టమంచి, దొడ్డిపల్లె, చిత్తూరు తదితర ప్రాంతాల్లోనూ గంగజాతర వైభవంగా జరిగింది.


గంగమ్మకు పూజలు నిర్వహిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే జగన్, సీకే బాబు


గంగమ్మకు అంబలి తీసుకొస్తున్న భక్తురాలు

నేడు నడి వీధి గంగమ్మల జల ప్రవేశం

చిత్తూరు బజారు వీధిలోని నడి వీధి గంగమ్మకు బుధవారం జలాధివాసం నిర్వహించనున్నారు.ఉత్సవ నిర్వాహకులు సీకే బాబు ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం అమ్మవారికి సారె సమర్పించాక ఊరేగింపు ప్రారంభమవుతుంది. మార్గమధ్యంలో భక్తులను ఆకట్టుకునేందుకు భారీగా సంగీత విభావరి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.అగస్తీశ్వరాలయం నుంచి ఓంశక్తి భక్తులు శరీరాలపై శూలాలు గుచ్చుకుని పొక్లయినర్లు, లారీల మీదుగా వేలాడుతూ వచ్చి హైరోడ్ మాక్స్ సెంటర్‌లో అమ్మవారికి పూలమాల సమర్పించనున్నారు. అనంతరం కట్టమంచి చెరువులో అమ్మవారికి జలాధివాసం నిర్వహించనున్నారు.

గంగ జాతరకు హాజరైన భక్తులకు పొన్నియమ్మ ఆలయం వద్ద అన్నదానం చేశారు. రాములగుడి వీధిలోని జైన్ ప్రార్థనా మందిరంలో మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. గిరింపేట గంగజాతరలో భక్తులకు మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్ పళ్ళరసాలను అందించారు. మంగళవారం సాయంత్రం నడివీధి గంగమ్మలకు ఉత్సవాల నిర్వాహకులు మహా కుంభ నైవేద్యం సమర్పించి పూజలు చేశారు.ఎస్పీ మణికంఠ కుటుంబసభ్యులతో కలిసి నడివీధి గంగమ్మతో పాటు మురకంబట్టు, కొంగారెడ్డిపల్లె, సంతపేట ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గంగమ్మలను దర్శించుకున్నారు.



పాఠశాలల పునర్వ్యవస్థీకరణ

- సమూల మార్పులకు శ్రీకారం
- తొమ్మిది రకాలుగా స్కూళ్ల విభజన
- 162 పాఠశాలల ఉన్నతీకరణ
- విద్యార్థుల సంఖ్య ఆధారంగా టీచర్ల కేటాయింపు
- పలు టీచర్ల పోస్టుల్లో సైతం మార్పులు

చిత్తూరు సెంట్రల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : జాతీయ విద్యాహక్కు చట్టం అమలులో భాగంగా పాఠశాలలకు సంబంధించి విద్యాశాఖ సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది.ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడం, డ్రాపౌట్లను తగ్గించడం, సబ్జెక్టు ఉపాధ్యాయులకు పనిభారాన్ని తగ్గిచడం, విద్యార్థుల అభ్యాస ఫలితాలు మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ మార్పులు చేపట్టనున్నారు.ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 162 ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయనున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 4,719వున్నాయి.17,372 టీచర్ల పోస్టులు మంజూరు కాగా, ప్రస్తుతం 15,454 మంది టీచర్లు పనిచేస్తున్నారు.1918 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 723మంది ఉపాధ్యాయులుండగా, ఎంపీపీ/జడ్పీ పాఠశాలల్లో 15,552 మంది, మున్సిపల్ పాఠశాలల్లో 589మంది, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో 508 మంది టీచర్లు పనిచేస్తున్నారు. గత నాలుగు నెలల కాలంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 4719 పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను విద్యాశాఖ చేపట్టింది.కలెక్టర్ అధ్యక్షతన జరుగుతున్న ఈ ప్రక్రియలో విద్యాశాఖ అధికారులు డీఈవో, డీవైఈవో, ఎంఈవోలు కీలక పాత్ర పోషిస్తున్నారు. అంగన్‌వాడీల నుంచి ఇంటర్మీడియట్ విద్య వరకు ప్రభుత్వ,జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలను తొమ్మిది రకాలుగా విభజిస్తున్నారు.

పాఠశాలల్లో సిబ్బంది

ప్రీప్రైమరీ పాఠశాల(ప్రీ ప్రైమరీ, ప్రైమరీ, 1-5 తరగతులు)ల్లో 1నుంచి 30మంది విద్యార్థులుంటే ఒక సెకండరీ గ్రేడ్ టీచర్, 31నుంచి 60 మంది దాకా ఉంటే ఇద్దరు సెకండరీ గ్రేడ్ టీచర్లను కేటాయిస్తారు.● మోడల్ ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో 1నుంచి 59 మంది విద్యార్థులుంటే మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం/స్కూల్ అసిస్టెంట్, ముగ్గురు ఎస్జీటీలను కేటాయిస్తారు. 60నుంచి 150మంది దాకా విద్యార్థులుంటే ఒక మోడల్ స్కూల్ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం/స్కూల్ అసిస్టెంట్, నలుగురు ఎస్జీటీలను కేటాయిస్తారు. 150కి పైగా విద్యార్థులుంటే ప్రతి 30 మంది విద్యార్థులకు అదనంగా ఒక ఎస్జీటీని కేటాయిస్తారు.●ఉన్నత పాఠశాల (6-8 తరగతులు)- 1నుంచి 10మంది విద్యార్థులకు ఒక స్కూల్ అసిస్టెంట్, 11నుంచి 30 మంది విద్యార్థులకు ఇద్దరు ఎస్‌ఏలు, 31నుంచి 140 వరకు నలుగురు ఎస్ఏలు,141 నుంచి 175 వరకు విద్యార్థులుంటే ఐదుగురు ఎస్‌ఏలను కేటాయిస్తారు. ● 75మంది విద్యార్థులున్న ఉన్నత పాఠశాలల్లో సీనియర్ ఎస్‌ఏ హెచ్‌ఎంగా వ్యవహరిస్తారు.● క్లస్టర్ ఉన్నత పాఠశాలల్లో ఒక హెచ్‌ఎం, ఒక ఎస్(పీఈ)/పీఈటీ పోస్టు కేటాయిస్తారు. 76కంటే ఎక్కువమంది విద్యార్థులుంటే హెచ్‌ఎం, ఎస్ఏ(పీఈ)/పీఈటీ పోస్టులు కేటాయిస్తారు.● 400 మంది విద్యార్థుల కంటే ఎక్కువ ఉంటే రెండు ఎస్‌ఏ, 751 మంది నమోదైతే 3వ ఎస్‌ఏ పోస్టు కేటాయిస్తారు. ఇలా 350మంది విద్యార్థులకు ఒక ఎస్‌ఏ పోస్టు కేటాయిస్తారు.

1. శాటిలైట్ ఫాండేషన్ స్కూళ్లు (ప్రీ ప్రైమరీ, ప్రైమరీ (అంగన్‌వాడీలు)	- 58
2. ఫాండేషన్ స్కూళ్లు (ప్రీ ప్రైమరీ, ప్రైమరీ, ఒకటి, రెండు తరగతులు)	- 991
3. బేసిక్ ప్రైమరీ స్కూళ్లు (ప్రీ ప్రైమరీ, ప్రైమరీ 1-5 తరగతులు)-	2018
4. మోడల్ ప్రైమరీ స్కూళ్లు (ప్రీ ప్రైమరీ, ప్రైమరీ 1-5 తరగతులు)	-928
5. అప్పర్ ప్రైమరీ స్కూళ్లు (ప్రీ ప్రైమరీ, ప్రైమరీ, 1-8 తరగతులు)	-70
6. హైస్కూళ్లు (6-10 తరగతులు)-	526
7. హైస్కూళ్లు (1-10 తరగతులు)-	71
8. హైస్కూల్ ప్లస్ (6-12 తరగతులు) + బేసిక్ ప్రైమరీ స్కూళ్లు 9. హైస్కూల్ ప్లస్ (1-12 తరగతులు) + మోడల్ ప్రైమరీ స్కూళ్లు	57
మొత్తం	4719

టీచర్ల కేడర్లలోనూ మార్పులు

స్కూల్ అసిస్టెంట్ పోస్టులను మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంలుగా మార్చారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎంపీపీ/జడ్పీ యాజమాన్యాల్లో 612మంది, మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆరుగురు ఉన్నారు. ● క్లస్టర్ స్థాయిలో వర్కింగ్ సర్ప్లస్ స్కూల్ అసిస్టెంట్/సెకండరీ గ్రేడ్ టీచర్, తత్సమాన పోస్టులను క్లస్టర్ లెవల్ అకడమిక్ టీచర్లుగా ఉపయోగించుకోనున్నారు. ఎంపీపీ/జడ్పీ యాజమాన్యాల్లో స్కూల్ అసిస్టెంట్లు 134మంది ఉండగా, ప్రభుత్వ యాజమాన్యంలో 6, మున్సిపల్ కార్పొరేషన్‌లో 8 మంది ఉన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యాశాఖలోని డీఈవో పూల్లో 217 మంది టీచర్లున్నారు. 65మంది హెచ్‌ఎంలు, 195మంది స్కూల్ అసిస్టెంట్లు, 11మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు ఉన్నారు. వీరిని సైతం సర్దుబాటు చేయనున్నారు.

ఇంటర్ పరీక్షలకు 319మంది గైర్హాజరు


పెనుమూరు జూనియర్ కళాశాలలో డీఐఈవో శ్రీనివాసులు తదితరులు

చిత్తూరు సెంట్రల్, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 35 కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన ఇంటర్ పరీక్షలకు 319మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈవో శ్రీనివాసులు తెలిపారు. ఫస్టియర్ ఇంటర్ జనరల్‌లో 5,584 మంది విద్యార్థులకు గాను, 215 మంది గైర్హాజరు కాగా, ఒకేషనల్‌లో 540 మందికి గాను 46 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. సెకండియర్ జనరల్‌లో 555 మందికి గాను , 44 మంది గైర్హాజరయ్యారన్నారు. ఒకేషనల్‌లో 139 మందికి గాను , 14 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. కార్వేటినగరం, చవటగుంట, పెనుమూరులోని కేంద్రాలను డీఐఈవో పరిశీలించగా, జిల్లా ప్రత్యేక అధికారి దయానందరాజు, కమిటీ సభ్యులు బాలసుబ్రమణ్యం, శరశ్చంద్రశేఖర్ 10 కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ 9 కేంద్రాలను పరిశీలించారు.



మొదటి ఘాట్‌లో అవ్వాచారి కోన వద్ద ఏర్పాటు చేసిన సోలార్ సీసీ కెమెరా

తిరుమల ఘాట్‌లోనూ సోలార్ సీసీ కెమెరాలు

తిరుమల, మే13(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భద్రతను కట్టుదిట్టం చేయడంలో భాగంగా ఘాట్ రోడ్లు సహా పలు ప్రాంతాల్లో సోలార్ సీసీ కెమెరాలను అమర్చారు. ప్రస్తుతం తిరుమల శ్రీవారి ఆలయం, వైకుంఠం క్యూకాంప్లెక్సులు, క్యూలైన్లు, అన్నప్రసాద భవనం, లడ్డూ కౌంటర్, కల్యాణకట్టలు, గదుల కేటాయింపు కేంద్రాలు, యాత్రికుల వసతి సముదాయాలు, అలిపిరి, జీఎన్సీ టోల్‌గేట్ వంటి ప్రాంతాలతో పాటు లేపాక్షి, రాంభగీచ, వరాహస్వామి వంటి ప్రాంతాల్లో దాదాపు 2,780 సీసీ కెమెరాలు ఉన్నాయి. పీఏసీ-4లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని వీడియో వాల్ ద్వారా వీటిని పరిశీలిస్తుంటారు. విశేష పర్వదినాల్లో అదనంగా కొన్ని ప్రాంతాల్లో కెమెరాలను ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో సీసీ కెమెరాలను తిరుమల సరిహద్దుల దాకా విస్తరించాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధనరాజు అభిప్రాయపడ్డారు. ఇందులో భాగంగా తిరుమల ఘాట్ రోడ్లు, పార్వేటమండపం, శ్రీవారిమెట్టు వంటి సరిహద్దు ప్రాంతాల్లోనూ సోలార్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. తొలివిడతలో 15 సోలార్ కెమెరాలను అమర్చారు. విద్యుత్‌తో అవసరం లేకుండా కేవలం సౌరశక్తితో ఇవి పనిచేయనున్నాయి. వీడియోతో పాటు ఆడియో టెక్నాలజీతో పనిచేసే ఈ సీసీ కెమెరాల ఫుటేజ్‌ను వైర్‌లెస్ కనెక్టివిటీతో ఎక్కడి నుంచైనా స్మార్ట్‌ఫోన్ ద్వారా వీక్షించవచ్చు. వీటి పనితీరు మంచి ఫలితాలు ఇస్తే తిరుమల చుట్టూ మరిన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.


సర్వదర్శనానికి 5 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 5 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 10 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని 2 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.90 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,760

తలనీలాలు సమర్పించినవారు: 29,361





అడుగడుగునా దండాలు. వీధి, వీధిన అంబళ్లు. నడివీధుల్లో సందళ్లు. వెరసి ఊరంతా జాతర సంబరం చేసుకుంది. అమ్మలుగన్న అమ్మకు పొంగళ్లు పెట్టుకుని ప్రణమిల్లింది. కోర్కెలు తీర్చే కొంగు బంగారాన్ని కళ్లకద్దుకుని తన్మయత్వమైంది. భక్తి పారవశ్యంతో చిందేసింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



గంగమ్మకు నీరాజనం

భక్తజనంతో పోటెత్తిన గంగమ్మ ఆలయం ● వేకువజామున చెంపనరుకుడుతో ముగియనున్న సంబరం







తిరుపతి గంగజాతరకు చాటింపు అనంతరం వివిధ వేషాలలో మునిగితేలిన తాతయ్యగుంట గంగమ్మను మంగళవారం ఉదయాత్పూర్వం విశిష్ట అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. మహాభిషేకంలో అర్చకులు మినహా ఎవరినీ అనుమతించలేదు. సర్వాలంకారశోభితమైన గంగమ్మకు అర్చకులు వజ్రకిరీట ధారణ చేశారు. సోమవారం అర్ధరాత్రి నుంచే కొందరు భక్తులు దండాలు, పొర్లు దండాలు పెట్టుకుంటూ, వేషాలతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఇలా.. అభిషేకానంతర దర్శనం మొదలుకొని నిర్విరామంగా గంగమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. పురుషులు పలురకాల విచిత్ర వేషధారణలతో పాటు, మహిళలు కొందరు వేపాకు చీరలు కట్టుకుని అమ్మవారి ఆలయ ప్రదక్షణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.టీపీ ఏరియాలో తాళ్లపాక పెదగంగమ్మ, చింతలచేనులో ముత్యాలమ్మ, దాసరిమఠంలో మాతమ్మ, పల్లెవీధిలో వేశాలమ్మ, చింతకాయవీధిలో కరిమాను గంగమ్మతో పాటు నగరంలోని చిన్నచిన్న గంగమ్మ ఆలయాల్లోనూ జాతర సంబరాలు జరిగాయి.మంగళవారం భక్తులు పలు పౌరాణిక, జానపద వేషాలు ధరించి అమ్మవార్లను దర్శించుకున్నారు. వారం రోజుల గంగజాతరలో మంగళవారం మాత్రమే అమ్మవారికి అలంకరించే బంగారు ముఖ కవచం, వజ్రకిరీటధారిణిని దర్శించుకున్న భక్తులు తన్మయత్వంలో మునిగిపోయారు.

నేడు విశ్వరూప దర్శనం

అమ్మవారి విశ్వరూప దర్శనం కోసం భక్తులు వేచి చూస్తున్నారు. పేరంటాల వేషధారులు పంబల వాయిద్యాలతో చాటు మండపం వద్దకు వెళ్లిన తరువాత బేరిశెట్టి ఇంటికి వెళ్లి అక్కడనుండి మరికొన్ని చోట్లకు వెళ్లి పేరంటాలు పూజలు అందుకుంటారు. అక్కడ నుండి బుధవారం వేకువజామున చిన గంగమ్మ చెంప నరికి ఆతరువాత పెద గంగమ్మ చెంప నరకడంతో జాతర సంబరం ముగుస్తుంది.

పీఎండీఎస్ సాగు పెంచాలి

తిరుపతి(కలెక్టరేట్), మే 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీఎండీఎస్ (తొలకరికి ముందే విత్తడం) సాగును పెద్దఎత్తున చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో పీఎండీఎస్ సాగుపై వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులతో సమీక్షించారు. పీఎండీఎస్ విత్తనాల కిట్‌ను పరిశీలించి సాగు విధానం గురించి తెలుసుకున్నారు. పీఎండీఎస్ విత్తనాల కిట్‌కు 30 రకాల పంట విత్తనాలు కలిపి తయారు చేస్తారన్నారు. ఎకరాకు 10-15 కిలోల విత్తనాలు విత్తుకోవాలన్నారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌కు 50వేల కిట్లు లక్ష్యంగా చేసుకుని రైతులకు సరఫరా చేయాలన్నారు. వరి నాట్లకు ముందు, మామిడి కోతల తరువాత ప్రతి రైతు తప్పనిసరిగా పీఎండీఎస్ విత్తనాలు చల్లుకోవాలని సూచించారు. దీంతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు, ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, జిల్లా పథక మేనేజరు షణ్ముగం పాల్గొన్నారు.

హిందువుల మనోభావాలను దెబ్బతీస్తారా?

● 'డీడీ నెక్స్ లెవల్' తమిళ సినిమాపై తిరుమల పోలీసులకు ఫిర్యాదు



తిరుమలలో తమిళనాడు మాజీ సీఎం పళనిస్వామికి వినతి పత్రం ఇస్తున్న కిరణ్ రాయల్

తిరుమల, మే13(ఆంధ్రజ్యోతి): 'డీడీ నెక్స్ లెవల్' అనే తమిళ సినిమాలో 'శ్రీనివాస గోవింద' అనే పాట హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా ఉందంటూ జనసేన నేత కిరణ్‌రాయల్ తిరుమల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ పాట వీడియోను కూడా ఫిర్యాదుతో పాటూ ఎస్‌ఐ రమేష్‌కు అందజేశారు. అనంతరం కిరణ్ రాయల్ మీడియాతో మాట్లాడుతూ, 'శ్రీనివాస గోవిందా' అనే పాటను రీమిక్స్ చేసి సినిమాలో క్లబ్ డ్యాన్స్‌గా మార్చారన్నారు. దీనిపై తమిళనాడులోని హిందువులు ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ సెన్సార్ బోర్డు అనుమతి ఇచ్చిందన్నారు. తమకు ప్రభుత్వ సహకారం కూడా ఉందని సినిమా బృందం సభ్యులు చెప్తున్నారన్నారు. తమిళనాడు ప్రభుత్వం నాస్తికుల ప్రభుత్వమన్నారు. దీన్ని హిందూ సమాజంపై కుట్రగానే భావిస్తున్నామన్నారు. ఆ సినిమాను బ్యాన్ చేయకుండా తమిళనాడు నుంచి నాయకులు తిరుమలకు వచ్చి పూజలు చేస్తామంటే ఒప్పుకోమన్నారు. కాగా శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన తమిళనాడు రాష్ట్ర ప్రతిపక్ష నేత, మాజీ సీఎం పళనిస్వామిని మంగళవారం కిరణ్‌రాయల్ కలిసి, భక్తుల మనోభావాలు కాపాడేందుకు సహకరించాలని కోరారు.

త్వరలో రుయాలో సిటీ డయాగ్నొస్టిక్ సెంటర్

తిరుపతి(కలెక్టరేట్), మే 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రుయాస్పత్రిలో త్వరలో సిటీ డయాగ్నొస్టిక్ సెంటర్ ప్రారంభిస్తామని ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండ్యన్, కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం సిటీ డయాగ్నొస్టిక్ సెంటర్‌పై వైద్యులు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. డయాగ్నొస్టిక్ సెంటర్ అందుబాటులోకి వస్తే 136 రక్త, మూత్ర ఇతర ముఖ్యమైన పరీక్షలు చేసే అవకాశం ఉంటుందన్నారు. తిరుపతి నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లోని 20 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల నుంచి వచ్చే రోగులకు ఈ కేంద్రంలో పరీక్షలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు, రుయా సూపరింటెండెంట్ రాధ ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.



వైద్యాధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ వీరపాండ్యన్, కలెక్టర్ వెంకటేశ్వర్

వాడివేడిగా జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

● కోరం లేకుండానే రెండో కమిటీ సమావేశ నిర్వహణ

● పీఆర్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్ శాఖల అధికారులను నిలదీసిన సభ్యులు





సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈవో రవికుమార్ నాయుడు - హాజరైన సభ్యులు, అధికారులు

చిత్తూరు రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి):చిత్తూరులోని జడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన స్టాండింగ్ కమిటీ సమావేశాలు వాడివేడిగా సాగాయి.మొత్తం 7 కమిటీల సమావేశాల్లో రెండో కమిటీ సమావేశాన్ని కోరం లేకుండానే పూర్తిచేశారు.6వ కమిటీ సమావేశానికి జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, 5వ కమిటీకి స్త్రీ, శిశు సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, తవణంపల్లె జడ్పీటీసీ భారతి, 3వ కమిటీకి వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి అధ్యక్షత వహించాల్సి ఉండగా వారు గైర్హాజరయ్యారు. అన్ని సమావేశాలకూ జడ్పీ చైర్మన్ శ్రీనివాసులే అధ్యక్షత వహించారు.1వ కమిటీ సమావేశంలో పాల్గొన్న సభ్యులే మిగిలిన కమిటీ సమావేశాల్లో పాల్గొనడం చర్చనీయాంశమైంది.సమస్యలపై చర్చలు తప్ప పరిష్కరించడం లేదని పలు శాఖల అధికారుల తీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత రెండు మూడు సమావేశాల్లో చర్చించిన సమస్యలను ఇంతవరకూ పరిష్కరించలేదని ఆరోపించారు.

బీసీ హాస్టళ్లలో ఈబీసీలకూ అవకాశం కల్పించండి:జడ్పీ చైర్మన్ సూచన

బీసీ హాస్టళ్లలో మిగిలిన సీట్లను వృధా కాకుండా ఈబీసీలకు అవకాశం కల్పించమని బీసీ సంక్షేమ అధికారులకు జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సూచించారు. వి.కోట బీసీ బాలికల హాస్టల్‌లో విద్యుత్ దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. వేరుశనగ విత్తనాల పంపిణీ ఆలస్యమవుతోందనగా గతేడాది 43 వేల క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేయగా.. ఈ ఏడాది అందులో సగం మాత్రమే జిల్లాకు కేటాయించారని, ఈ నెలలో పంపిణీ ప్రారంభిస్తామని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. దీనిపై జడ్పీ చైర్మన్ ఉన్నతాధికారులతో మాట్లాడి గతం కన్నా ఈ ఏడాది అధికంగా పంపిణీ చేయాలని సూచించారు. ●రామసముద్రం మండలంలో అసంపూర్ణంగా వున్న గ్రామ సచివాలయాల భవనాలను పూర్తి చేయాలని జడ్పీటీసీ రామచంద్రారెడ్డి కోరారు.ఆర్.నడింపల్లె కొండపై 9 నెలల కిందట వాలీశ్వరస్వామి దేవస్థానానికి వెళ్లేందుకు రూ.2 కోట్లతో రోడ్డు పనులు మొదలుపెట్టి చదును చేసి వదిలిపెట్టారని, వర్షం పడినప్పుడల్లా రోడ్డులోని మట్టి కొట్టుకుపోతోందన్నారు.జడ్పీ గ్రాంట్ కింద సుమారు రూ.45 లక్షలు వాటర్ వర్క్స్ కోసం మంజూరవగా.. రూ.1.20 లక్షలు మాత్రమే ఖర్చు చేశారని సభ దృష్టికి తీసుకొచ్చారు. ●నారాయణవనం మండలంలోని ఎరుకంబట్టు, గోవిందప్పనాయుడు కండ్రిగ, సుబ్బానాయుడు కండ్రిగ, తుంబూరు, పాలమంగళం పంచాయతీల్లో రోడ్లపై కంకరవేసి వదిలిపెట్టారని, దీంతో రాత్రివేళల్లో ప్రయాణికులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని జడ్పీటీసీ సుమన్‌కుమార్ చెప్పారు.తారు రోడ్డు వేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. ●వడమాలపేట జడ్పీటీసీ మురళి మాట్లాడుతూ 2015లో రూ.11 లక్షలతో అభివృద్ధి పనులు చేశానని, టెండర్ పిలిచినప్పుడు వ్యాట్, జీఎస్టీ లేదని చెప్పి తీరా బిల్లులు మంజూరు అయ్యాక జీఎస్టీ కట్టమని ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. ●పాలసముద్రం జడ్పీటీసీ అన్బలగన్ మాట్లాడుతూ బాలకృష్ణాపురం రోడ్డుపై 2018లో కంకరవేసి వదిలిపెట్టడంతో 5 గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ● పెద్దతిప్పసముద్రం జడ్పీటీసీ శివన్న మాట్లాడుతూ కందుకూరులో తాగునీటి కోసం బోరు వేసి మోటర్ బిగించి విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. ●చౌడేపల్లె జడ్పీటీసీ దామోదరరాజు మాట్లాడు తూ వ్యవసాయ సర్వీసులకు డబ్బులు చెల్లించి రెండేళ్లుగా రైతులు ఎదురుచూస్తున్నారని,ఏఈని అడిగితే మెటీరియల్ లేదని సమాధానం చెబుతున్నారని వాపోయారు ● పెనుమూరు జడ్పీటీసీ దొరస్వామి మాట్లాడుతూ కొటార్లపల్లె ఏఏడబ్ల్యూ జగనన్న కాలనీలో 25మంది ఇళ్లు నిర్మించుకున్నా విద్యుత్ సర్వీసు ఇవ్వలేదని చెప్పగా సమస్యను పరిష్కరిస్తామని ఎస్ఈ హామీ ఇచ్చారు. ●ఏర్పేడు జడ్పీటీసీ తిరుమలయ్య మాట్లాడుతూ మరమ్మతుకు గురైన ట్రాన్స్‌ఫార్మర్ల కోసం కార్యాలయాల చుట్టూ రైతులు కాళ్లరిగేలా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విద్యుత్ శాఖ ఎస్ఈ దృష్టికి తీసుకొచ్చారు.సమావేశానికి వైద్య శాఖ అధికారుల గైర్హాజరుపై సభ్యులతో పాటు జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా స్థాయి సమావేశానికి చిన్న స్థాయి అధికారులను పంపడం ఏంటని అసహనం వ్యక్తం చేశారు.జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డిప్యూటీ సీఈవో జుబేదా తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



తిరుచానూరు, మే 13(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి కుటుంబ సమేతంగా దర్శించు కున్నారు. ఆలయం వద్ద ఏఈవో దేవరాజులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకున్న వీరు.. అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. అమ్మవారి శేషవస్త్రంతో వేదపండితులు సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు పాల్గొన్నారు.

గంజాయి ముఠా అరెస్టు

● రెండు కిలోల గంజాయి స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), మే 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో గంజాయి విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి దాదాపు రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అలిపిరి సీఐ రాంకిషోర్ కథనం మేరకు.. శ్రీకాళహస్తి దర్గామిట్టకు చెందిన షేక్ మహబూబ్‌బాషా, కేవీబీపురం మండలం రాగిగుంటకు చెందిన కంచి చైతన్య, తిరుపతి సత్యనారాయణపురానికి చెందిన ఆదెం వెంకటసాయిప్రతాప్‌రెడ్డి, తిరుపతి రూరల్ తిమ్మినాయుడుపాళెంకు చెందిన మంగళం జోసెఫ్ కొంతకాలంగా తిరుపతి రైల్వే స్టేషన్, బస్టాండు, ఇతర రద్దీ ప్రాంతాలను అడ్డాగా చేసుకుని గంజాయి విక్రయించేవారు. వీరు శ్రీకాకుళం జిల్లాకు చెందిన కింగ్‌పిన్ నుంచి రైళ్ల ద్వారా గంజాయి తెప్పించి చిన్న, చిన్న పొట్లాలు కడతారు. ఒక్కో పొట్లాన్ని రూ.100 నుంచి రూ.200 వరకు విక్రయించేవారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఎస్‌ఐలు నాగార్జునరెడ్డి, సిబ్బంది కలసి లీలామహల్- మంగళం రోడ్డులోని బొంతాలమ్మ ఆలయం వద్ద కాపుకాచి నిందితులను పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంగమ్మ స్ఫూర్తితో తిరుగుబాటు చేయాలి

● సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



తిరుపతి(ఆటోనగర్), మే 13 (ఆంధ్రజ్యోతి): 'నాడు పాలెగాళ్లకు వ్యతిరేకంగా సాగిన పోరాటమే నేటి గంగ జాతర. గంగమ్మ పోరాట స్ఫూర్తితో ప్రజలు పాలకులపై తిరుగుబాటు చేయాలి' అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మను మంగళవారం దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. 'వేల మంది జాతరకు హాజరైన సమయంలో వివిధ వేషాల్లో ఉన్నవారు ఎన్ని బూతులు తిట్టినా ప్రజలు పట్టించుకోరు. అదే ఈ జాతర ప్రత్యేకత' అని పేర్కొన్నారు. 40 ఏళ్ల క్రితం ఒక వ్యక్తి ఆడవేషం వేసుకుని తనను బండిపై ఎక్కించుకొని వెళ్లారంటూ నారాయణ గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కె.మోహన్ కుమార్ రాజు, ఎ.రామానాయుడు, పి.మురళి తదితరులు పాల్గొన్నారు.

అంతా.. ప్రశాంతంగా..!

● పోలీసుల చొరవ భేష్



వీఐపీ దారిలో భక్తులను నియంత్రిస్తున్న డీఎస్పీ భక్తవత్సలం

తిరుపతి(నేరవిభాగం), మే 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి గంగ జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. రద్దీని నియంత్రించడంతో ఎక్కడా తొక్కిసలాటలు జరగలేదు. మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి భక్తుల రద్దీ బాగా పెరిగింది. వేలాది మంది ఒక్కసారిగా రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసి పోయింది. వీఐపీ లైను వద్ద మాత్రం చాలా రద్దీ కనపడడంతో డీఎస్పీ భక్తవత్సలం దగ్గరుండి భక్తులను అనుమతించారు. ఒక దశలో భక్తుల రద్దీని నియంత్రించడం పోలీసుల చేయిదాటే పరిస్థితి రావడంతో వెంటనే రోప్ పార్టీని పిలిపించారు. రాత్రి 7 గంటల నుంచి 9.45 గంటల వరకు మహిళలు, యువకులు, వేషాలు ధరించి వస్తున్న భక్తులు ఎక్కువ సంఖ్యలో రావడంతో వారిని కంట్రోలు చేయడానికి ఇబ్బంది పడ్డారు. ఇక, అన్ని కోణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో ఎక్కడ ఎలాంటి పరిస్థితి ఎదురైనా కమాండ్ కంట్రోలు యూనిట్ ద్వారా పరిశీలించి చర్యలు చేపట్టారు. భారీ సంఖ్యలో పోలీసులు మోహరించడంతో దొంగలు, చైన్ స్నాచర్లకు కొంత భయం ఏర్పడింది. బిట్రగుంట గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకోవడంతో చైన్ స్నాచింగ్‌లు కొంత తగ్గుముఖం పట్టాయి. ఇక, జనంలో మిస్ అయిన వారికోసం బాధితులు పోలీసు కంట్రోలు రూముకు సమాచారం ఇస్తుండడంతో వెంటనే వారిని అప్పగించేలా చర్యలు చేపట్టారు. ఇలా రెండు రోజుల వ్యవధిలో దాదాపు 53 మందిని అప్పగించారు.

సింగిల్ విండోలకు త్రిసభ్య కమిటీలు

కసరత్తు చేస్తోన్న ప్రభుత్వం

చిత్తూరు కలెక్టరేట్, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (సింగిల్ విండో)ల పాలకవర్గాలుగా త్రిసభ్య కమిటీల ఏర్పాటుపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కూటమి పార్టీలకు చెందిన వారి పేర్లను పరిశీలిస్తోంది. త్వరలోనే నియామకాలు చేపట్టనుంది. గత వైసీపీ హయాంలో సహకార రంగం నిర్వీర్యంగా మారింది. వైసీపీ కార్యకర్తలనే అర్హతే ప్రామాణికంగా సింగిల్ విండోల్లో పెద్దఎత్తున సభ్యులను చేర్పించారు. డైరెక్టర్లుగా నిపుణుల నియామకంలోనూ ఆ పార్టీ వారికే పెద్దపీట వేశారు. పెట్రోల్ బంకుల ఏర్పాటు, జనఔషధి కేంద్రాలు... ఇలా ఒకటేమిటి... అన్నింటా వారికే ప్రాధాన్యత ఇచ్చారు. డీసీసీబీ, సీడీసీఎంఎస్, కో-ఆపరేటివ్ ప్రింటింగ్ ప్రెస్‌ల పర్సన్ ఇన్‌చార్జి సెవెన్‌మెన్ కమిటీల్లోనూ వైసీపీకి చెందిన వారినే నియమించారు. గత ఐదేళ్లలో ఎన్నిక లేకపోవడంతో పర్సన్ ఇన్‌చార్జిల కమిటీలే ఐదేళ్లూ కొనసాగాయి. ప్రస్తుతం జిల్లాలో సహకారశాఖకు చెందిన అధికారిక పర్సన్ ఇన్‌చార్జి కమిటీలున్నా... అక్రమాలపై చర్యలు తీసుకోవడం లేదు. సహకార రంగంలో అద్భుతాలు చేశామంటూ నివేదికలు ఇస్తున్న అధికారులు ఆ సింగిల్ విండోల్లో పేరుకుపోయిన అవినీతి, అక్రమాలను తామే పెంచి పోషించామని మాత్రం చెప్పడం లేదు. వీటన్నింటి నేపథ్యంలో అనర్హుల ఓట్లు తొలగించడంతో పాటు అక్రమాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని, ఆ తర్వాతే ఎన్నికలకు వెళ్లాలన్న అభిప్రాయం అధికార పార్టీల నేతలు, కార్యకర్తల నుంచి వస్తోంది. ప్రజాప్రతినిధులు కూడా కమిటీల ఏర్పాటుకే మొగ్గు చూపుతున్నారు. దీంతో ఆయా ఎమ్మెల్యేలు వారి పరిధిలో వచ్చే సింగిల్ విండోలకు, త్రిసభ్య కమిటీలకు ముగ్గురేసి పేర్లను ప్రభుత్వానికి అందిస్తున్నారు. ముగ్గురు సభ్యుల్లో బీసీ, ఎస్సీ, ఓసీ వర్గాలకు చెందిన వారుండాలి.వీరిలో ఒక మహిళ విధిగా ఉండాలి. ఎమ్మెల్యేలిచ్చే జాబితాలనే జిల్లా పార్టీ నాయకులు పరిశీలించి తుది జాబితాను జిల్లా ఇన్‌చార్జి మంత్రికి అందిస్తారు. ఆయన ప్రభుత్వానికి అందజేస్తారు.

ఐదేళ్లపాటు దోచేశారు : సహకార రంగాన్ని వైసీపీ నాయకులు గత ఐదేళ్లు దోచేశారు. చివరకు కోవిడ్ సమయంలోనూ వదల్లేదు. నాబార్డు ద్వారా వచ్చిన నిధులను కూడా అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచనల మేరకు ఎవరికి వారే పంచుకున్నారు. దీంతో సింగిల్ విండోల్లో సైతం రూ.కోట్లలో అవకతవకలు జరిగినట్లు అంచనా. జిల్లాలో 75 సింగిల్ విండోలుండగా, వాటిలో 45 నష్టాల్లో కొనసాగుతున్నాయి. సంఘాల్లో అక్రమాలు జరిగినా, ప్రభుత్వం ఇంతవరకు విచారణకు ఆదేశించలేదు. డీసీసీబీ అవకతవకలపై సహకార చట్టం -51 కింద విచారణకు ఆదేశించిన ప్రభుత్వం నష్టాల్లో కూరుకుపోయిన సీడీసీఎంఎస్, నష్టాల్లోని 35 సింగిల్ విండోల్లో జరిగిన అవకతవకలపై విచారణకు ఆదేశించకపోవడం పట్ల టీడీపీ నాయకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక భద్రతా సిబ్బంది సేవలు కీలకం

● ఎస్పీ మణికంఠ



శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రతినిధులకు, అధికారులకు గన్‌మెన్లు(ప్రత్యేక భద్రతా సిబ్బంది) అందించే భద్రతా సేవలు అత్యంత కీలకమైనవని ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో గన్‌మెన్లకు ముగింపు శిక్షణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గన్‌మెన్లు ఒక వ్యక్తికో లేదా ఒక ప్రజాప్రతినిధికో భద్రత, రక్షణ కల్పించడం లేదని... ఒక వ్యవస్థను, ప్రజాస్వామ్యాన్ని కాపాడతున్నామన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. విధి నిర్వహణలో ఉన్నప్పుడు గన్‌మెన్లు ఆయుధ వినియోగంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. మానసిక ధైర్యం, వేగవంతమైన స్పందన, అప్రమత్తత, ప్రోటోకాల్‌పై అవగాహన తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ శివానంద కిశోర్, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, ఐఎస్‌డబ్ల్యూ డీఎస్పీ అంకారప్ప, అడ్మిన్ ఆర్ఐ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఈతకెళ్లి బాలుడి మృతి



మృతిచెందిన బాలుడు కార్తీక్ - ప్రమాదానికి కారణమైన కుశస్థలి నది

శ్రీరంగరాజపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): కుశస్థలి నదిలో ఈతకు వెళ్లి బాలుడు మృతిచెందిన సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు ఎస్ఆర్‌పురం మండలం పి.వి.పురం గ్రామానికి చెందిన సురేష్, నందినిల రెండవ కుమారుడు కార్తీక్(8) తోటి పిల్లలతో కలసి గ్రామ సమీపంలో ఉన్న కుశస్థలి నదిలో ఈతకెళ్లాడు. ఈత రాని కార్తీక్ ప్రమాదవశాత్తున లోతు ఎక్కువగా ఉన్న చోటుకెళ్లడంతో నీటిలో మునిగిపోయాడు. తోటి పిల్లలు కేకలు వేయడంతో గ్రామస్థులు వచ్చి నదిలో మునిగిపోయిన కార్తీక్‌ను బయటకు తీశారు. అప్పటికే ఆ బాలుడు మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల కార్తీక్ తల్లి నందిని మృతి చెందింది. ఆమె కర్మక్రియలు బుధవారం ఉండడంతో, ఇప్పుడు కుమారుడు కూడా మృతి చెందడంతో, పి.వి.పురం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



ఉత్తరబ్రాహ్మణపల్లె వద్ద పొలాల్లోకి దూసుకువెళ్లిన కారు

తవణంపల్లె, మే 13 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి కారు పొలాల్లోకి దూసుకువెళ్లిన సంఘటన మండలంలోని ఉత్తర బ్రాహ్మణపల్లె వద్ద మంగళవారం సాయంత్రం జరిగింది. మండలంలోని తవణంపల్లె బండమీద ఇండ్లుకు చెందిన ఓ వ్యక్తి కారులో తవణంపల్లె నుంచి ఉత్తరబ్రాహ్మణపల్లె మీదుగా కాణిపాకం వైపు వెళుతూ అజాగ్రత్తగా నడపడంతో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన గల పొలాల్లోకి దూసుకువెళ్లింది. దీంతో కారు ధ్వంసమైంది. కారు నడుపుతున్న వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. కారు పొలాల్లోకి దూసుకుపోయిన సమయంలో పెను ప్రమాదం తప్పింది. కారు విద్యుత్ టాన్స్‌పార్మర్‌కి ఒక్క అడుగు దూరంలో నుంచి పొల్లాలోకి దూసుకువెళ్లింది. విద్యుత్ టాన్స్‌ఫార్మర్‌ను కారు ఢీకొని ఉంటే పెనుప్రమాదం జరిగి ఉండేది. సంఘటనా స్థలాన్ని స్థానిక పోలీసులు పరిశీలించారు. పూర్తి వివరాలు తెలియాల్సివుంది.

పిడుగుపాటు మృతులకు పరిహారం మంజూరు

తిరుపతి, మే 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లాలో అకాల వర్షాల సందర్భంగా పిడుగుపాటుతో మరణించిన నలుగురి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ఈనెల 2న ఎర్రావారిపాలెం మండలం బోడేవాండ్లపల్లి పంచాయతీ వడ్డిపల్లికి చెందిన కోటకొండ రమణ (59).. 4న నాయుడుపేట మండలం వద్దిగుంట కండ్రిగకు చెందిన అల్లం భాస్కర్ (54), నాయుడుపేటకు చెందిన మారిబోయిన కార్తీక్ (10), వాకాడు మండలం బాలిరెడ్డిపాలేనికి చెందిన రెడ్డి మునెయ్య (44) పిడుగుపాటుకు బలైన సంగతి తెలిసిందే. ఈ రెండు తేదీలలో పిడుగు పాటుకు మృతి చెందిన నలుగురికి సంబంధించి.. ఒక్కో కుటుంబానికి రూ.4 లక్షలు వంతున ప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది. ఈ మేరకు మృతుల కుటుంబాలకు రూ.16 లక్షలు చెల్లించాలని కలెక్టర్‌ను ఆదేశిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

బియ్యం కార్డులకు భారీగా దరఖాస్తుల రాక

చిత్తూరు కలెక్టరేట్, మే 13 (ఆంధ్రజ్యోతి): బియ్యం కార్డులకు భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. సోమవారం వరకు 3,830 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. కొత్త కార్డులకోసం 523, కార్డుల్లో సభ్యుల చేర్పులకు 2752, సభ్యుల విభజనకు 383, మృతిచెందిన వారిపేరు తొలగించడానికి 44, కార్డుల సరెండర్‌కు 16, తప్పుగా నమోదైన ఆధార్ సీడింగ్ దిద్దుబాటుకు 112 దరఖాస్తులు అందాయని వెల్లడించారు.

చెరువుల సంరక్షణకు అధిక ప్రాధాన్యం

● కలెక్టర్ సుమిత్‌కుమార్



చెరువు పనులపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

గుడిపాల, మే 13 (ఆంధ్రజ్యోతి): చెరువుల సంరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని రామిరెడ్డిపల్లె చెరువు, నారాయణరెడ్డి చెరువు, వసంతాపురంలోని బంగారక్క చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూగర్భ జలాల పెంపు, తాగునీటి అవసరాల కోసం చెరువులను సంరక్షించాలని, రానున్న వర్షాకాలం కంటే ముందుగానే చెరువుల్లో పూడికతీత పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయకట్టుదారులు, రైతులు కలిసి చెరువుల్లో పూడిక పనులను చేపట్టాలన్నారు. సర్వే చేసి ఆక్రమణలు ఉంటే నోటీసులు జారీ చేయాలన్నారు. పూడిక పేరుకుపోవడం వల్ల నీటి సామర్థ్యం తగ్గిపోయిందని ఆయకట్టుదారులు వారి దృష్టికి తెచ్చారు. మండలంలో ఈ మూడు చెరువుల్లో ఉపాధి పథకం కింద ఒక్కో చెరువుకు రూ.40 లక్షలతో పనులు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం కారణంగా పేరుకుపోయిన మట్టి గురించి కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, స్పందించిన ఆయన సత్వరమే మట్టిని తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గాంధీ, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వర రాజు, ఈఈ మురళీకుమార్, ఎంపీడీవో శిరీష, తహసీల్దార్ జయంతి, మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, టీడీపీ నేతలు బాలాజీ, హేమాద్రి నాయుడు, సుమతి, మురళీ నాయుడు, నాగరాజ యాదవ్, బాల సుబ్రహ్మణ్యం యాదవ్, ఐజాక్, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

ఎండలు చుర చుర

చిత్తూరు కలెక్టరేట్, మే 13 (ఆంధ్రజ్యోతి): వారం క్రితం నుంచి కత్తెర నెల ప్రారంభం కావడంతో ఎండలు పెరుగుతున్నాయి. మంగళవారం వెదురుకుప్పంలో అత్యధికంగా 42.1, పుంగనూరులో అత్యల్పంగా 33.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మండలాలవారీగా గుడిపాలలో 39.7, శ్రీరంగరాజపురంలో 39.5, చిత్తూరు, తవణంపల్లెలో 39.2, బంగారుపాళ్యంలో 38.4, గంగాధరనెల్లూరులో 38.1, పులిచెర్ల, పూతలపట్టు మండలాల్లో 38.0, కార్వేటినగరంలో 37.9, నదుంలో 37.4, చౌడేపల్లి, నగరి, యాదమరి, పాలసముద్రం, పెనుమూరు, విజయపురం, ఐరాల, నిండ్ర మండలాల్లో 36.9, గంగవరం, పెద్దపంజాణి, సోమల మండలాల్లో 36.8, రొంపిచెర్లలో 36.4, గుడుపల్లి, శాంతిపురం మండలాల్లో 35.1, పలమనేరులో 34.8, కుప్పంలో 34.5, బైరెడ్డిపల్లి, వి.కోటలో 34.4, రామకుప్పంలో 33.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

● 12 మండలాల్లో వర్షం

కాగా 48 గంటల్లో జిల్లావ్యాప్తంగా 12 మండలాల్లో తేలికపాటి నుంచి బలమైన వర్షం కురిసింది. అత్యధికంగా వెదురుకుప్పంలో 52.4, అత్యల్పంగా పెనుమూరులో 2.6 మిమీ వర్షపాతం నమోదయ్యింది. మండలాలవారీగా తవణంపల్లెలో 44.2, చౌడేపల్లిలో 29.4, బంగారుపాళ్యంలో 27.2, రామకుప్పంలో 12.2, శాంతిపురంలో 8.4, పూతలపట్టులో 7.2, వి.కోటలో 7.0, యాదమరిలో 5.8, గంగాధరనెల్లూరులో 5.2 పెద్దపంజాణిలో 4.8 మిమీ వర్షం కురిసింది.

రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టు దుర్మరణం

● భార్యను చూడడానికి వెళుతుండగా ప్రమాదం



గిరిబాబు (ఫైల్‌ఫొటో)

వెదురుకుప్పం, మే 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ స్కూటరిస్టు దుర్మరణం పాలైన ఘటన మంగళవారం రాత్రి కార్వేటినగరం మండలంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. కార్వేటినగరం మండలం కొటార్వేడుకు చెందిన చిన్నబ్బ కుమారుడు ఎ.గిరిబాబు(29)కు తమిళనాడులోని తిరుత్తణికి చెందిన మౌనిక అలియాస్ దివ్యతో వివాహం జరిగింది. ఆమె అనారోగ్యంతో ఉండటం వల్ల పుట్టింటి వద్ద ఉంది. ఆమె మూడు నెలల గర్భిణీ అని చెప్పారు. ఈ నేపథ్యంలో గిరిబాబు మంగళవారం సాయంత్రం కొటార్వేడు నుంచి బైక్‌లో భార్యను చూడటానికి బయలుదేరాడు. ఈ క్రమంలో కార్వేటినగరం మండలం కొల్లాగుంట ఏఏడబ్ల్యు సమీపంలో చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై పుత్తూరు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న లారీ వెనుక వైపు నుంచి స్కూటరిస్టును ఢీకొట్టి కొంత దూరం లాక్కెళ్లింది. దీంతో గిరిబాబు అక్కడికక్కడే దుర్మరణం పాలై మృతదేహం ఛిద్రమైంది. ప్రమాదం జరిగిన స్థలానికి చేరుకున్న కొందరు అతడిని గిరిబాబుగా గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. బంధువుల సమాచారం మేరకు కార్వేటినగరం పోలీసులు సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి, వివరాలు సేకరిస్తున్నారు. ఈ విషయమై పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషిచేయండి

● కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, మే 13 (ఆంధ్రజ్యోతి): మెప్మా ద్వారా మున్సిపాలిటీల్లో స్వయం సహాయక సంఘాల్లోని సభ్యుల ఆర్థికాభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మున్సిపల్ కమిషనర్లతో పలు అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీ ద్వారా మహిళలు బ్యాంకు లింకేజి, స్త్రీనిధి రుణాల సద్వినియోగం ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలుగా తయారుకావాలని పిలుపునిచ్చారు. ఇందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. ప్రతి మున్సిపాలిటీకి కేటాయించిన లక్ష్యాలను అధిగమించేవిధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలచే చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో పెట్రోల్ బంకు నిర్వహణకు సంబంధించి స్థలసేకరణ అంశాన్ని పరిశీలించాలని చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులును కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మెప్మా పీడీ రవీంద్ర, ఎల్డీఎం హరీష్, చిత్తూరు కమిషనర్ నరసింహ ప్రసాద్‌తో పాటు అన్ని మున్సిపాలిటీల కమిషనర్లు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయ సెక్యూరిటీ గార్డు దౌర్జన్యం

● కమీషన్ కోసం లాడ్జి మేనేజరుతో వాగ్వాదం

శ్రీకాళహస్తి, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు లాడ్జీలో భక్తులు అద్దె గదులు పొందడంపై కమీషన్ ఇవ్వాలంటూ ఓ ముక్కంటి ఆలయ సెక్యూరిటీ గార్డు దౌర్జన్యానికి పాల్పడ్డాడు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో పనిచేసే కొందరు సెక్యూరిటీ గార్డులు భక్తులను అద్దె గదుల కోసం ప్రైవేటు లాడ్జీలకు పంపుతుంటారు. భక్తుల నుంచి అధిక ధరలు వసూలు చేసి నిర్వాహకులు దళారీలుగా వ్యవహరించే సెక్యూరిటీలకు కమీషన్లు చెల్లిస్తుంటారు. అలా ఓ సెక్యూరిటీ గార్డు 2వ గేటు సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు లాడ్జి మేనేజరుతో మంగళవారం వాగ్వాదానికి దిగాడు. తానుపంపించిన భక్తులు తీసుకున్న అద్దె గది నుంచి కమీషన్ ఇవ్వాలంటూ బూతుల దండకం అందుకున్నాడు. తాము ఎలాంటి కమీషన్లు ఇవ్వమని మేనేజరు ఎదురుదాడి దిగుతూ ఈ సంభాషణను వీడియో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశాడు. ముక్కంటి ఆలయ సెక్యూరిటీ గార్డు యూనిఫాంలో కమీషన్ కోసం బూతు పదజాలంతో మాట్లాడిన తీరుపై పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి.

ఆ అధికారి తీరు వల్లే...: ముక్కంటి ఆలయంలో కీలక స్థానంలో ఉన్న ఓ అధికారి తీరువల్ల గత ఆరేళ్ల నుంచి సెక్యూరిటీ వ్యవస్థ దళారీకి మారుపేరుగా మారిపోయింది. సంపాదనే ధ్యేయంగా ము క్కంటి ఆలయంలో ఓ అధికారి 2019 వైసీపీ పాలన నుంచి బరితెగించాడన్న అపవాదును మూటగట్టుకున్నాడు. వైసీపీ నేతల నుంచి ఆయనకు పూర్తిమద్దతు ఉండటంతో నాలుగున్నర సంవత్సరాల పాటు ఆయన సెక్యూరిటీ వ్యవస్థను అవినీతిమయంగా మార్చేశారన్న విమర్శలు వెల్లువెత్తాయి. పలు నేరాల్లో భాగస్వాములు అయిన వారిని, సెక్యూరిటీకి ఎలాంటి అర్హత లేనివారిని సైతం ఆయన యధేచ్ఛగా నియమించుకున్నాడు. ముక్కంటి ఆలయంలో హుండీ లెక్కింపులో భారీగా చోరీకి పాల్పడి పట్టుబడిన సెక్యూరిటీ గార్డును పదేళ్ల క్రితం అప్పటి అధికారులు తొలగించారు. వైసీపీ పాలనలో అవినీతి అధికారిగా పేరు మోసిన వ్యక్తి హుండీ దొంగను తన అనధికారిక పీఏగా నియమించుకున్నారు. సెక్యూరిటీ వ్యవస్థలో తిరిగి హుండీ చోరీ కేసులో నిందితుడైన వ్యక్తిగా దర్జాగా నియమించుకున్నారు. ఒక రోజు కూడా ఆ సెక్యూరిటీ గార్డు యూనిఫాం ధరించకపోగా వైట్ అండ్ వైట్‌లో వైర్‌లెస్ సెట్‌ను చేతబట్టి కీలక అధికారిగా ఆలయంలో చెలరేగిపోయేవాడు. దీనిపై పెద్దఎత్తున ఫిర్యాదులు వచ్చాయి. దాంతో అధికారి తన అనధికారిక సెక్యూరిటీ గార్డును తాత్కాలికంగా తొలగించారు. ఆయనకు ఉన్న అధికారిక పలుకుబడితో హుండీ చోరీకి పాల్పడిన యువకుడిని సరిగ్గా గత ఏడాది ఎన్నికలకు ముందు ఒప్పంద ఉద్యోగిగా కమిషన్ ఆర్డర్స్‌తో తిరిగి అధికారికంగా నియమించుకున్నారు. ఈ సమయంలో నాలుగున్నరేళ్ల పాటు వైసీపీ పాలనలో భారీగా అవినీతి అక్రమాలకు పాల్పడ్డ ఆ అధికారికి చివరి ఆరు నెలల కాలంలో పంపకాల విషయంలో వైసీపీ నేతలతో విబేధాలు తలెత్తాయి. దాంతో ఆయన్ను గోశాలకు బదిలీ చేశారు. తాను వైసీపీకి వ్యతిరేకినంటూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆ అధికారి మళ్లీ టీడీపీ నేతల పంచన చేరాడు. ఆలయంలోకి పది నెలల క్రితం తిరిగి మళ్లీ తిష్టవేశాడు. అప్పటి నుంచి రెట్టించి అక్రమాలకు పాల్పడుతున్నట్లు తరచూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా ఆయన పరిధిలోని విభాగాల్లో ఉన్న సెక్యూరిటీ వ్యవస్థపై మళ్లీ ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ అధికారి పర్యవేక్షణలో సుమారు తొమ్మిదిసార్లు పలువురు సెక్యూరిటీ గార్డులు భక్తుల నుంచి డబ్బులు వసూలు చేసి దర్జాగా అడ్డదారి దర్శనాలకు వెళుతూ పట్టుబడ్డాడు. ఈ అధికారి అక్రమ వసూళ్ల సెక్యూరిటీ గార్డులకు అండగా నిలబడటంతో ఏ ఒక్కరిపై అప్పట్లో చర్యలు తీసుకోలేదు. ఒక సెక్యూరిటీ గార్డు ప్రైవేటు అద్దె గదెను ప్రోత్సహించడమే కాకుండా కమీషన్ కోసం గొడవకు దిగడం పెద్దఎత్తున చర్చనీయాంశంగా మారింది. ఆరేళ్ల నుంచి అక్రమాలకు అండగాద నిలుస్తున్న అధికారిపై దేవదాయశాఖ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

హోమ్ స్టేల క్రమబద్ధీకరణకు కసరత్తు

జీఎస్టీ పరిధిలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు ● నేడు నిర్వాహకులతో సమావేశం



తిరుపతి(విద్య), మే 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలోని హోమ్ స్టేలపై వాణిజ్య పన్నుల శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వీటిని జీఎస్టీ పరిధిలోకి తీసుకువచ్చేందుకు కసరత్తు ప్రారంభించారు. తిరుమల భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో నగరంలో హోంస్టేల సంఖ్య కూడా పెరుగుతోంది. హోటళ్లకంటే చౌకగా, సౌకర్యవంతంగా ఉండటంతో వీటికి గిరాకీ ఏర్పడింది. ఇప్పటికే సుమారు 200 వరకు హోంస్టేలున్నట్టు అధికారులు గుర్తించారు.

జీఎస్టీ రిజిస్ట్రేషన్ లేకుండానే.. : వ్యాపార సముదాయాలైన హోంస్టేలు నిబంధనల ప్రకారం జీఎస్టీ పరిధిలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఏటా రూ.20 లక్షల వాడేలు దాటిన హోం స్టేలు ఈపన్ను పరిధిలోకి వస్తాయి. కానీ చాలామటుకు ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండానే నడుస్తున్నాయి. ఈ క్రమంలో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు హోంస్టేలపై ఫోకస్ పెట్టారు. ఇటీవల తనిఖీలు చేసి ప్రధానమైన 12 హోంస్టేల రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. అన్నింటినీ పరిశీలించాక జీఎస్టీ పరిధిలోకి ఎన్ని వస్తాయో లెక్కవేయనున్నట్లు సమాచారం.

ముందుగా అవగాహన... ఆపై చర్యలు



హోంస్టేల నిర్వహకులకు వ్యాపారా లావాదేవీలు, నిబంధనలు, జీఎస్టీపై అవగాహన కల్పిస్తాం. ఈనెల 14న తిరుపతి వాణిజ్య పన్నులశాఖ కార్యాలయంలో హోంస్టేల నిర్వహకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశాం. నిర్వహకులందరికీ జీఎస్టీపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తాం. ఆ తరువాత కూడా జీఎస్టీ రిజిస్ట్రేషన్ తీసుకోకుండా, పన్నులు చెల్లించకుండా నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

\- జాన్ స్టీవెన్‌సన్, వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్

13వ సారీ ఆయనే టీడీపీ అధ్యక్షుడు!



బాలాజీ నాయుడు

విజయపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): విజయపురం మండలంలోని గంగమాంబాపురానికి చెందిన బాలాజీ నాయుడు మరోసారి టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 13 పర్యాయాలుగా గ్రామ కమిటీ టీడీపీ అధ్యక్షుడిగా ఆయనే ఎన్నికవుతూ వస్తున్నారు. పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా వరుసగా సుమారు 27 సంవత్సరాల పాటు గ్రామంలో టీడీపీ తరఫున పని చేయడం గర్వంగా ఉందని చెప్పారు. తనకు శ్వాస ఉన్నంత వరకు తెలుగుదేశం పార్టీకే సేవ చేస్తానని తెలిపారు. అలాగే మహారాజపురానికి చెందిన సతీష్ 4 పర్యాయాలు అంటే సుమారు 8 సంవత్సరాలు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

మనమిత్రను ఉపయోగించుకోండి

● కలెక్టర్ సుమిత్‌కుమార్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సేవలను సులభతరం చేస్తూ ప్రభుత్వం ప్రారంభించిన మన మిత్ర వాట్సప్ గవర్నెన్స్‌కు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆవిష్కరించారు. మంగళవారం కలెక్టరేట్ లోని మీటింగ్ హాలులో ఈ కార్యక్రమం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ మన మిత్ర వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌరసేవలు వాట్సప్ నెంబరు 95523 00009 ద్వారా అందుబాటులో ఉంచారని తెలిపారు. ప్రజలనుంచి వినతులు స్వీకరించేందుకు, వారికి అవసరమైన సమాచారాన్ని చేరవేసేందుకు వాట్సప్ గవర్నెన్స్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజలు వాట్సప్ నెంబర్‌ను సేవ్ చేసుకుని, ఆ నెంబరుకు హాయ్ అని సందేశం పంపడం ద్వారా అవసరమైన ప్రభుత్వ సేవలను ఎంపిక చేసుకోవచ్చన్నారు. వాట్సప్ గవర్నెన్స్‌లోని చాట్‌బాట్, ఈ-ధ్రువీకరణ పత్రాలు, రశీదులు, అక్నాలెడ్జ్‌మెంట్స్ అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సహకార సొసైటీ అక్రమాలపై

నేటి నుంచి విచారణ

తిరుపతి(నేరవిభాగం), మే 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా పోలీసు సహకార సొసైటీలో జరిగిన రూ.80 లక్షల అక్రమాలపై బుధవారం నుంచి అధికారులు విచారణ చేపట్టనున్నారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి నేతృత్వంలో క్రైం డీఎస్పీ శ్యామ్‌సుందర్, నాయుడుపేట డీఎస్పీ శేషుబాబు విచారణాధికారులుగా నియమితులైన విషయం తెలిసిందే. ఈ అక్రమాలకు సూత్రధారులు ఎవరనే కోణంలో వీరు దర్యాప్తు చేసి ఎస్పీకి నివేదిక సమర్పించనున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. దాదాపు ఐదుగురు పోలీసు సిబ్బంది హస్తం ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని పక్కకు తప్పించారు. కాగా, దుర్వినియోగమైన రూ.80 లక్షల్లో.. రుణాలు తీసుకున్న సొసైటీ సభ్యుల్లో ఎవరు చెల్లించిన డబ్బులు ఉన్నాయి? వీరు ఎప్పుడు చెల్లించారనే వివరాలు సేకరించే పనిలో అధికారులు ఉన్నారు. ఈ ఘటనలో ఆధారాలు దొరక్కుండా డేటాను మార్చే ప్రయత్నాలు జరుగుతున్నట్లు విమర్శలున్నాయి. మరో వైపు తమకు న్యాయం చేయాలని బాధిత పోలీసులు కోరుతున్నారు.

ముగిసిన అమ్మవారి వసంతోత్సవాలు



స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుచానూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి వసంతోత్సవాలు మంగళవారం రాత్రి ముగిశాయి. ఉదయం మూలమూర్తికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో నేత్రపర్వంగా అభిషేకం జరిగింది. మధ్యాహ్నం ఉత్సవర్లను ప్రైడే గార్డెన్‌కు వేంచేపు చేసి బంగారు పీఠంపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణలు, భక్తుల గోవిందనామ స్మరణల నడుమ స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి అమ్మవారికి వీధోత్సవం జరిగింది. మూడు రోజుల పాటు జరిగిన వేడుకలు మహాపూర్ణాహుతితో ముగిశాయి. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, టీటీడీ ఉద్యానశాఖ అధికారి శ్రీనివాసులు, ఏఈవో దేవరాజులు, అర్చకులు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రూ.2లక్షల పంచలోహ విగ్రహం చోరీ



చోరీకి గురైన పంచలోహ విగ్రహం

పాలసముద్రం, మే 13 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలంలోని వెంగళరాజుకుప్పం గంగమ్మ గుడిలోని అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని సోమవారం రాత్రి దొంగలు దోచుకెళ్లారు. ఆలయంలోని హుండీని పగులగొట్టి సుమారు రూ.లక్ష నగదును, మైక్ సెట్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. పంచలోహ విగ్రం సుమారు రూ.2 లక్షల ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. ఈ చోరీ విషయాన్ని పాలసముద్రం ఎస్ఐ చిన్నరెడ్డెప్పకు వారు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, ఆలయంలో ఉన్న సీసీ కెమెరాల వైర్లను కత్తిరించి చోరీ చేసినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని ఎస్ఐ పోలీసు ఉన్నతాధికారులకు తెల్పడంతో చిత్తూరు నుంచి క్లూస్ టీం వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించి, వేలి ముద్రలను సేకరించారు. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

గంగమ్మ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు



గంగమ్మ జాతర శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, మే 13 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో ఈనెల 14, 15, 16 తేదీల్లో ప్రతిష్ఠాత్మకంగా జరిగే గంగమ్మ జాతరకు ఉత్సవ కమిటీ పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతోందని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఏటా పలమనేరులో గంగమ్మ జాతర వైభవంగా నిర్వహిస్తారని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ముందస్తుగా ప్రజలకు గంగ జాతర శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, బ్రహ్మయ్య, నాగరాజు, ఖాజా, ప్రతాప్‌రెడ్డి, అమరనాథరెడ్డి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల నిరసన



ప్రభుత్వాస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

పలమనేరు, మే 13 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు మంగళవారం విధులు బహిష్కరించి ఆసుపత్రి ఎదుట నిరసన తెలిపారు. గత మూడు నెలలుగా జీతాలు అందక పోవడంతో వారం రోజుల క్రితం ఆసుపత్రి ఎదుట బైఠాయించారు. అయితే జిల్లా అధికారులు పట్టించుకోక పోవడంతో మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల జీతాలు ఇప్పటివరకు చెల్లించలేదని పేర్కొన్నారు. యూనిఫాం అందించాలని, అదనపు సిబ్బందిని నియమించి పనిభారం తగ్గించాలని డిమాండు చేశారు. సీఐటీయూ నాయకులు గిరిధరగుప్తా పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ద్వితీయ శయనోత్సవం



అలంకరణలో మృత్యుంజయేశ్వరస్వామి దంపతులు

చౌడేపల్లె, మే 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆది దంపతులకు శాస్త్రోక్తంగా ద్వితీయ శయనోత్సవాన్ని నిర్వహించారు. మంగళవారం ఉదయం స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు రాజశేఖర్ దీక్షితులు, కుమారస్వామి, మహేష్ దీక్షితులు పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులభాగ్యం కల్పించారు. రాత్రి ఆలయంలో పట్టుపాన్పును ఏర్పాటు చేసి స్వామి వారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అధిష్ఠింపజేశారు. అనంతరం శాస్త్రోక్తంగా ద్వితీయ శయనోత్సవం నిర్వహించారు. గిరి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.

ఘనంగా మనుకూరమ్మ జాతర



చౌడేపల్లె, మే 13 (ఆంధ్రజ్యోతి): ఊటూరు సమీపంలో వెలసిన మనుకూరమ్మ జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఊటూరు, చిప్పిలివారిపల్లె, వెంగళపల్లె, కాగతి, కొండామారి, మర్రిమాకులపల్లె, గాజులవారిపల్లె, గూబలవారిపల్లె, గుట్టకిందపల్లె, పాల్యెంపల్లె, చిన్నఓబునపల్లె తదితర గ్రామాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కోనేరు పునరుద్ధరణకు భూమిపూజ



భూమి పూజలో పాల్గొన్న రమేష్‌రెడ్డి

చౌడేపల్లె, మే 13 (ఆంధ్రజ్యోతి): కోనేరు పునరుద్ధరణకు టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి, ఎంపీడీవో లీలామాధవి మంగళవారం భూమి పూజ నిర్వహించారు. చౌడేపల్లె సమీపంలోని దొరబావి తోట వద్ద పుంగనూరు జమిందార్లు నిర్మించిన అత్యంత పురాతనమైన కోనేరు ఉందన్నారు. ఆ కోనేరును ఉపాధి హామి నిధులతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చంద్రమౌళి, ఏపీవో చిట్టెమ్మ, పంచాయతీ కార్యదర్శ మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

నేడు రామకుప్పంలో టైలరింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభం

రామకుప్పం, మే 13 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని మహిళా మండల సమాఖ్య భవనంలో గురువారం బీసీ కార్పొరేషన్ ద్వారా మహిళలకు టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం ప్రారంభిస్తారని ఎంపీడీవో మురళీధర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమానికి మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

గంగమ్మసేవలో చల్లా రామచంద్రారెడ్డి



చిత్తూరు గంగమ్మను దర్శించుకున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో జరిగే గంగమ్మ జాతరలో పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మంగళవారం రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో కలిసి అమ్మవారికి పూజలు చేపట్టారు.

సారా విక్రేత అరెస్టు



మురళీ నాయక్ అరెస్ట్ చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

పుంగనూరు రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): నాటు సారా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు పుంగనూరు ఎక్సైజ్ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పుంగనూరు మండలంలోని పట్రపల్లెతాండాకు చెందిన మునస్వామినాయక్ కుమారుడు మురళీనాయక్ వద్ద నిల్వ ఉన్న 20 లీటర్ల నాటు సారా, 100 లీటర్ల బెల్లం ఊటను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో ఎస్ఐ వేణుగోపాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్‌లో పరమహంస విద్యార్థుల ప్రతిభ



గజ్జల తేజశ్రీ

శాంతిపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షల్లో శాంతిపురం మండలం కుతేగానిపల్లెలోని పరమహంస యోగానంద విద్యాలయ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల చైర్మన్ గోపాల్ అగర్వాల్, ప్రిన్సిపాల్ ఆజాద్ హుస్సేన్ తెలిపారు. 39 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వంద శాతం ఫలితాలు సాధించినట్లు పేర్కొన్నారు. 500 మార్కులకు గాను గజ్జల తేజశ్రీ 475, వరుణ్ 460, తేజశ్రీ రెడ్డి 439 మార్కులు సాధించి విద్యాలయం టాపర్లుగా నిలిచారు. విద్యార్థులు, ఉపాధ్యాయులను యాజమాన్యం అభినందించింది

అకాల వర్షాలతో నేలవాలిన వరి



పెద్దపంజాణి, మే 13 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో వరి పంట దెబ్బతింటోంది. పంట కోత దశకు చేరుకున్న సమయంలో వర్షాలు, గాలుల కారణంగా పంట నేలకొరిగి ంది. ఏప్రిల్, మే నెలల్లో వరి పంట చేతికందే సమయం కాగా పంట దెబ్బతింటోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి వరి రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రతిఒక్కరూ బాధ్యతతో జీవించాలి



గ్రంథాలయంలో మాట్లాడుతున్న విశ్వర్షి వసంతకుమార్

పలమనేరు, మే 13 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతిఒక్కరూ బాధ్యతతో జీవించాలని.. మానవ సంబంధాలు పెంపొందించుకోవడానికి కళలు, సాహిత్యం ఉపకరిస్తాయని మాస్టర్ విశ్వర్షి వాసిలి వసంతకుమార్ అన్నారు. మంగళవారం సాయంత్రం పలమనేరు శాఖా గ్రంథాలయంలో జరిగిన రచయితల సంఘ ఇష్టాగోష్ఠి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జీవితం అత్యంత విలువైందని. మనుషులు నటించడం మాని జీవితానికి అర్థం తెలుసుకోవాలన్నారు. ఓటమి తాత్కాలికమని నమ్మితే గెలుస్తారన్నారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో పలమనేరు రచయితల సంఘం గౌరవాధ్యక్షులు ఆర్.మాధవ్, గ్రంథాలయ అధికారి హేమకుమార్, జొన్నవిత్తుల శ్రీరామచంద్ర మూర్తి, శ్రీనివాస, సంపాదకులు మొహిద్దీన్, దోర్నాదుల సిద్దార్థ, చంద్రశేఖరయ్య, రసజ్ఞుల సమాఖ్య అధ్యక్షులు శ్రీపురం సీతారామయ్య, కట్టమంచి కృష్ణవేణి, రైతు సంఘ నాయకులు ఉమాపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కుప్పంలో రైళ్ల నిలుపుదలకు వినతి



డీఆర్ఎంకు వినతిపత్రం అందిస్తున్న జగదీశ్‌బాబు తదితరులు

కుప్పం, మే 13 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర సందర్భంగా కుప్పం మీదుగా రాకపోకలు సాగించే అన్ని రైళ్లను కుప్పంలో నిలుపుదల చేయాలని బెంగళూరు డివిజనల్ రైల్వే మేనేజరు అశుతోశ్ కుమార్ సింగ్‌కు సాయిమాతా సేవాట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు విన్నవించారు. బెంగళూరులోని రైల్వేస్ కార్యాలయంలో మంగళవారం ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా జగదీశ్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోనే ముఖ్యమైన కూడలైన కుప్పంలో ఈనెల 14 నుంచి 21 వరకు గంగ జాతర అత్యంత వైభవంగా జరుగుతుందన్నారు. హంసఫర్ ఎక్స్‌ప్రెస్, ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్‌లను కుప్పంలో నిలుపుదల చేయాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. రైళ్లను కుప్పంలో నిలుపుదల చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో కుప్పిగానిపల్లె నాగరాజు నాయుడు, కిశోర్ కుమార్, గుత్తార్లపల్లె సురేశ్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రాయలపేట - పుంగనూరు రహదారి

- మలుపులతో తరచూ రోడ్డు ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



గుంతలమయమైన రోడ్డు



రాయలపేట మార్గంలో ప్రమాదకరంగా ఉన్న మలుపులు

పెద్దపంజాణి, మే 13 (ఆంధ్రజ్యోతి): గుంతలమయంగా ఉన్న రాయలపేట-పుంగనూరు రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. దాదాపు 20 గ్రామాల ప్రజలకు నిత్యం నరకం చూపుతున్న ఈ మార్గాన్ని అభివృద్ధి చేయాలని గతంలో అధికారులు, పాలకులకు విన్నవించినా ఫలితం శూన్యం. అయితే ఈ రోడ్డు గత ప్రభుత్వంలో పుంగనూరు నుంచి నియోజకవర్గ సరిహద్దు వరకు రోడ్డును అభివృద్ధి చేసి పలమనేరు నియోజకవర్గంలోని రోడ్డును గాలికొదిలేశారు. దీనిపై పెద్దపంజాణి మండలంలోని ఈ మార్గంలో నిత్యం పయనించే వాహనదారులు, రైతులు, విద్యార్థుల నుంచి తీవ్ర విమర్శలు ఎదురవుతున్నాయి. రెండు నియోజకవర్గాల్లోనూ వైసీపీ ఎమ్మెల్యేలు గెలిచినా పలమనేరు నియోజకవర్గంపై వివక్ష ఎందుకని ప్రజలు అనేక పర్యాయాల్లో అప్పటి ఎమ్మెల్యేని నిలదీసినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. తేలికపాటి జల్లులకే రోడ్డు చిత్తడి అవుతోంది. ముఖ్యంగా నగిరేపల్లె నుంచి చెన్నారెడ్డిపల్లె వరకు మలుపులు ఎక్కువగా ఉండటంతోపాటు రోడ్డుకు ఇరువైపులా చెట్లు ఏపుగా పెరగడంతో మలుపుల్లో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతోపాటు ఎమ్మెల్యేగా అమరనాథరెడ్డి విజయం సాధించడంతో ఈ రోడ్డు అభివృద్ధి చెందుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నగిరేపల్లె నుంచి చెన్నారెడ్డిపల్లె వరకు అభివృద్ధి జరిగితే 20 గ్రామాల ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. ఇకనైనా సంబంధిత అధికారులు, ఎమ్మెల్యే స్పందించి చర్యలు తీసుకోలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వాస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు : ఆర్డీవో



చిన్నపిల్లల వార్డులో పరిశీలిస్తున్న పలమనేరు ఆర్డీవో భవాని

పుంగనూరు రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందివ్వాలని పలమనేరు ఆర్డీవో భవాని వైద్యులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె వైద్యాధికారి డాక్టర్ హరిగోపాల్‌నాయక్‌తో మాట్లాడుతూ ఆసుపత్రి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. అనంతరం వార్డుల్లో పరిశీలించి రోగులకు అందుతున్న చికిత్సలపై ఆరా తీశారు. డాక్టర్లు, సిబ్బంది పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందిస్తున్న భోజనం, కూరలను ఆమె పరిశీలించి మరింత రుచిగా భోజనం అందివ్వాలని సూచించారు. ఆసుపత్రికి రెండేళ్ల క్రితం ప్రభుత్వం మంజూరు చేసిన అంబులెన్స్ ఎందుకు నిరుపయోగంగా ఉందని ప్రశ్నించారు. అంబులెన్స్ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రోగులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. అలాగే బీడీ కాలనీలోని వార్డు సచివాలయాలను ఆమె తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. సచివాలయ అధికారులు, సిబ్బంది విధులకు సక్రమంగా హాజరుకాకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఫణికుమార్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

కబ్జాలపై అధికారుల చర్యలు శూన్యం

- జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు అయూబ్‌ఖాన్, జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నరసింహులు



తీగలమ్మచెరువు ఆక్రమణలను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు


పుంగనూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు, కాలువలు, వంకలు, చెరువులను యథేచ్ఛగా ఆక్రమిస్తున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు పి.అయూబ్‌ఖాన్, జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నరసింహులు వాపోయారు. మంగళవారం పుంగనూరులో విలేకర్లతో మాట్లాడుతూ పుంగనూరులో ఆక్రమణలపై తహసీల్దార్, ఆర్డీవో, జేసీ, కలెక్టర్ వరకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆక్రమణలను అధికారులు అడ్డుకునే పరిస్థితి ఉండేది కాదని.. ప్రస్తుత ప్రభుత్వంలో సైతం స్పందించకపోవడం ఏంటని అధికారులను ప్రశ్నించారు. పుంగనూరు బైపాస్‌రోడ్డులోని జేన్యూటౌన్ ఎదురుగా ఉన్న తీగలమ్మ చెరువును వైసీపీ నేత ఆక్రమించి చదును చేస్తుంటే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. చెరువులో మట్టి తీయడం, వెంచర్‌గా చదును చేస్తున్నారని ఆరోపించారు. పుంగనూరు ఆర్టీసీ డిపో పక్కన సర్వే నంబర్ 132/1, 132/3లోని ప్రభుత్వ భూమిలో రూ.కోట్ల విలువైన 10 సెంట్లు భూమి ఆక్రమణకు గురైనట్లు అధికారులు గుర్తించారని చెప్పారు. రాయలచెరువు మొరవ కాల్వలో సర్వే నెంబరు 134ను ఖాతానెంబరు 479లో అక్రమంగా చేర్చి కొందరు విక్రయాలు జరిపారని, గుడిసిబండ రెవెన్యూ పరిధిలో సర్వేనంబర్ 265/1లో 1.55 ఎకరాలు, 265/2లో 16.34 ఎకరాలు, స్థానిక దోబీకాలనీ సమీపంలోని రాయలచెరువు మొరవ వంక పూర్తిగా ఆక్రమణకు గురై వంకే అదృశ్యమైందని ఆరోపించారు. రాయల్‌చెరువు వంక, కౌండిన్యనది, చౌడేపల్లె రోడ్డులోని వంకలను ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నా రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకుంటే త్వరలో నిరసన చేపడుతామని హెచ్చరించారు.

పిడుగుపాటుకు ఆవు మృతి



కల్లూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం ఉప్పువడ్డిపల్లిలో మంగళవారం సాయంత్రం పిడుగుపాటుకు పాడి ఆవు మృతి చెందగా ఓ యువకుడు స్పృహ తప్పి పడిపోయిన సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన తీర్థానంద్ తన ఇంటి సమీపంలోని చింతచెట్టు కింద పాడి ఆవును కట్టేశాడు. మంగళవారం సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో ఇంటి సమీపంలో పిడుగుపడిన శబ్ధం రావడంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. చింతచెట్టుకింద ఉన్న పాడి ఆవు మృతిచెందింది. పాడి ఆవుకు సమీపంలో ఉన్న గ్రామానికి చెందిన యువకుడు గణేష్ (22) స్పృహ తప్పి పడిపోయాడు. యువకుడిని పీలేరు ఆస్పత్రికి తరలించారు. గణేష్‌కు ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. పాడి ఆవు విలువ రూ.లక్ష ఉంటుందని.. తనను ప్రభుత్వం ఆదుకోవాలని పాడి రైతు కోరారు.

గంగజాతర ఉత్సవాలు



కల్లూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోని కల్లూరు విరూపాక్షమ్మ ఆలయం, ఎల్లంకివారిపల్లి పాలేటమ్మ అమ్మవారి ఆలయాల్లో మంగళవారం గంగజాతర ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహించారు. సాయంత్రం ఆదిపరాశక్తి అవతారంలో దర్శనమిచ్చిన విరూపాక్షమ్మ, పాలేటమ్మ అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారు పురవీధుల్లో విహరిస్తుండగా భక్తులు హారతులు అందించారు.

మద్యం దుకాణానికి దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని పెద్దపంజాణి మండలంలో ఓ మద్యం దుకాణానికి గీత కార్మికులు ఈనెల 15తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ సురేష్ రెడ్డి తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు జిల్లా వాసులుగా ఉండాలని, గీత కార్మికుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా జతపరచాలని సూచించారు. 17వ తేదీన చిత్తూరు కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతిలో మద్యం దుకాణం కేటాయింపు జరుగుతుందని తెలిపారు. వివరాలకు ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం



తాగునీటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో బాలాజీ

పెద్ద పంజాణి, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దవెళగటూరు, అమ్మరాజుపల్లె, బొమ్మరాజుపల్లె, చామనేరు, ముదరంపల్లె, నిడిగుంట, శంకర్రాయలపేట, మాదనపల్లె, రాజుపల్లె గ్రామాల్లో ఎంపీడీవో బాలాజీ మంగళవారం పర్యటించారు. పారిశుధ్యం, తాగునీటి వసతులను పరిశీలించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమలత, పంచాయతీ విస్తరణాధికారి శారదాదేవి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు

పుంగనూరు రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంతో రైతులు పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు పొందొచ్చని పుంగనూరు వ్యవసాయశాఖ ఏడీఏ శివకుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని నెక్కుంది రైతు సేవా కేంద్రంలో రైతులకు వ్యవసాయ యాప్‌పై అవగాహన కల్పించారు. యాప్‌తో రైతులకు కలిగే లాభాలను వివరించారు. 30 మంది రైతులకు వారి ఫోన్లలో వ్యవసాయ యాప్‌ను డౌన్‌లోడ్ చేసి వాటి వినియోగంపై శిక్షణ అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో రైతు ఆత్మహత్య

గంగవరం, మే 13 (ఆంధ్రజ్యోతి): కుటుంబ తగాదాలతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన గంగవరం మండలం కోటగురువేపల్లెలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన సురేష్‌కుమార్ (37) వ్యవసాయం చేసుకొని జీవనం సాగించేవాడు. భార్య శిరీష కొద్దిరోజుల క్రితం భర్తతో గొడవపడి అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తితో వివాహం చేసుకుంది. గత రెండు రోజుల క్రితం సురేష్‌కుమార్, శిరీష, ఆమె రెండో భర్త ముగ్గురూ కలిసి గొడవ పడ్డారు. ఈక్రమంలో మనస్తాపానికి గురైన సురేష్‌కుమార్ ఇంట్లో ఉరేసుకుని మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు.

కోలాహలంగా కంచి గరుడ సేవ

● గరుడుడిపై విహరించిన కరియమాణిక్యస్వామి



గరుడ వాహనంపై విహరిస్తున్న కరియమాణిక్యస్వామి - మహిళల కోలాటం

నగరి, మే 13 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని పెరుమాళ్‌గుడి వీధిలో గల శ్రీదేవి, భూదేవి సమేత కరియమాణిక్యస్వామి ఆలయంలో కంచి గరుడసేవ కోలాహలంగా జరిగింది. ఇందులో భాగంగా స్వామి వారిని సుంద రంగా అలంకరించి సువర్ణశోభిత గరుడ వాహనంపై అధిష్ఠింపజేశారు. మంగళ వారం ఉదయం 6-30 నుంచి 8.30 గంటల వరకు కరియమాణిక్యుడు తనకు అత్యంత ప్రీతిపాత్రమైన గరుత్మంతుడిపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. మాడవీధులు కోలాటాలు, కేరళవాయిద్యాలు, భజనలు, గోవింద నామస్మరణలతో మార్మోగాయి. భక్తులు కరియమాణిక్యుడిని దర్శించు కుని మొక్కులు తీర్చుకున్నారు. చిన్నారుల శ్రీకృష్ణ, రుక్మిణి, సత్యభామ ఇతర దేవతల వేషధారణ అలరించింది. ఈవో నాగరత్నమ్మ, ఏఈవో రవి, సూపరిం టెండెంట్ శంకర్, ఆలయ ఇన్‌స్పెక్టర్ రమణ, సురేష్‌బాబు సీఐ విక్రమ్, మున్సి పల్ కమిషనర్ కృష్ణారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు ధన్వంతరాచార్యులు, నర సింహప్రసాద్, అభివృద్ధి సలహా కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణమ నాయుడికి ప్రభుత్వవిప్ పరామర్శ



చిత్తూరులో కృష్ణమ నాయుడితో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ థామస్

గంగాధరనెల్లూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు పార్లమెంట్ టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడు చిత్తూరులోని తన స్వగృ హంలో సోమవారం ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడడంతో కుడిచేతికి ఫ్యాక్చర్ అయింది. ఈ సమాచారం తెలుసుకుని మంగళవారం ఉదయం పలు వురు టీడీపీ నేతలతో కలిసి చిత్తూరులో కృష్ణమ నాయుడిని ప్రభుత్వవిప్ డాక్టర్ థామస్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నేతలు శ్రీధర్‌యాదవ్, స్వామిదాస్, దేవసుందరం, మోహన్ నాయుడు, పురుషోత్తం నాయుడు, హరీష్ యాదవ్, గంధమనేని జయశంకర్ నాయుడు, మురళీకృష్ణరాజు, కృష్ణమూర్తి నాయుడు, నిరంజన్‌రెడ్డి, కుప్పయ్య పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో 'విజయం' విద్యార్థుల హవా



ఇంటర్ విద్యార్థులు



టెన్త్ విద్యార్థులు

చిత్తూరు సెంట్రల్, మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ మంగళవారం విడు దల చేసిన ఇంటర్, టెన్త్ ఫలితాల్లో స్థానిక విజయం సీబీఎస్ఈ స్కూల్ విద్యా ర్థులు ప్రతిభ చూపినట్లు విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి తెలిపారు. ఇంటర్మీ డియట్‌లో 500 మార్కులకు గాను కె.ఎస్.జాగృతి 465, భవ్యశ్రీ 417, యోషికా 406, కీర్తనా 405 మార్కులు సాధించగా, టెన్త్‌లో 600 మార్కులకుగాను ఎం.ఎ్ ఎ.శ్రేయా 570, సుహానాఖాన్ 564, దినేష్‌రాజ్ 555, ప్రేమశ్రీ 545, చాణుక్యలు 536 మార్కులు సాధించినట్లు తెలిపారు. వీరిని అకడమిక్ డైరెక్టర్ శైలజా మూర్తి, అధ్యాపకులు అభినందించారు.

దూదేకుల, ముస్లిం, మైనార్టీలు నష్టపోవాలా?



గఫూర్

వెదురుకుప్పం, మే 13 (ఆంధ్రజ్యోతి): ముస్లిం, మైనారిటీ కేటగిరిలో వెంటనే బీసీ-బీ దూదేకుల ఆప్షన్ పొందుపరిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నూర్ బాషా ముస్లిం మైనారిటీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి దూదేకుల గుండు మల్లి గఫూర్ డిమాండ్ చేశారు. మంగళ వారం వెదురుకుప్పంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సాంకేతిక లోపం వల్ల ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమా లకు వేల మంది దూదేకుల ముస్లింలు దూరమవుతున్నారని గుర్తుచేశారు. ఈ సాంకేతిక లోపం వల్ల అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమయ్యే పరిస్థితి నెలకొందని ఆవేదన చెందారు. సమస్యను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ముఖ్యం: థామస్

పెనుమూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించి, న్యాయపాలన అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమని ప్రభుత్వ విప్ థామస్ అన్నారు. ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన మీ ఊరికి మీ థామస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మండలంలోని గుట్టకిం దపల్లి దళితవాడలో ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. గ్రామంలో తాగునీరు, దారి సమస్యలు, పింఛన్లు కావాలని డ్వాక్రా మహిళలు ఎమ్మెల్యేకి అర్జీలు సమర్పించారు. అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు ఇచ్చి సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీ ల్దారు శ్రావణ్‌కుమార్, ఏపీవో గుణశేఖర్, ఏఈ తులసిప్రసాద్, రమేష్, ప్రభుకి రణ్, మురళీ, మండల టీడీపీ అధ్యక్షుడు రుద్రయ్య నాయుడు, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్, భాస్కర్, కార్జాల అరుణ, హరిబాబునాయుడు, మనోహర్‌రెడ్డి, తలారి రెడ్డెప్ప, కృష్ణమూర్తి నాయుడు, చిరంజీవిరెడ్డి, కిషోర్ నాయుడు, ప్రసాద్, ఏకాంబరం, రాధమ్మ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఆరిమాని గంగమ్మకు ప్రత్యేక పూజలు

శ్రీరంగరాజపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలం, గంగమ్మ గుడి దేవస్థానం గ్రామంలో వెలసిన ఆరిమాని గంగమ్మకు మంగళవారం అర్చ కులు వెంకటాచలపతి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పైనేని ధనంజే యులు, చందు, మధు తదితరులు పాల్గొన్నారు.

ఊరూర గంగమ్మకు పొంగళ్లు

వెదురుకుప్పం, మే 13(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం, వెదురుకుప్పం మండ లాల్లోని పలు గ్రామాల్లో మంగళవారం గ్రామ దేవతలు, గంగమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ క్రమంలో పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు.

పైపులైన్ లీకేజీ అరికట్టండి



లీకేజీ అవుతున్న పైప్‌లైన్

విజయపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిశక్తి ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలో శ్రీహరిపురానికి తాగునీరు సరఫరా చేసే పైపులైన్ లీకేజీకి గురైందని, లీకేజీని అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. లీకేజీ తారు రోడ్డులో ఉండడం వలన రోడ్డు ధ్వంసం కావడంతో చెత్తాచెదారం పైపులైన్‌లో చేరి నీరు కలుషితమవుతుందని చెప్పారు. ఈ విషయమై అధికారులు చర్య తీసుకోవాలని వారు కోరుతున్నారు.



చిత్తూరు నడివీధి గంగ జాతరలో ప్రభుత్వ విప్ థామస్



కొంగారెడ్డిపల్లె నడివీధి గంగ జాతరలో ఎమ్మెల్యే పులివర్తి నాని



కొంగారెడ్డిపల్లె నడివీధి గంగమ్మ సేవలో ఎస్పీ మణికంఠ దంపతులు



చిత్తూరు నడివీధి గంగమ్మ జాతర తొలిపూజలు నిర్వహిస్తున్న వంశపారంపర్య ధర్మకర్తలు సీకే.బాబు దంపతులు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ దంపతులు, కట్టమంచి, కొంగారెడ్డిపల్లెల్లో కొలువుతీరిన నడివీధి గంగమ్మ

వైభవం.. నడివీధి గంగ జాతర

● నేడు ట్రాఫిక్ మళ్లింపు



కొంగారెడ్డిపల్లె నడివీధి గంగమ్మకు పభుత్వం తరపున సారె సమర్పిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తదితరులు



నడివీధి గంగమ్మ జాతరలో అమ్మవారికి అంబలి సమర్పిస్తున్న భక్తులు



చిత్తూరు అర్బన్, మే 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం నడి వీధి గంగ జాతర అత్యంత వైభవంగా ప్రారంభమైంది. భక్తులు పూజలుచేసి, అంబళ్ళు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నడివీధి గంగమ్మ నిమజ్జన కార్యక్రమం బుధవారం జరుగుతున్నందున నగరంలో ట్రాఫిక్‌ను మళ్లించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అమ్మవారి నిమ జ్జనం జరిగేంత వరకు ట్రాఫిక్ మళ్లింపు నిబంధనలు అమలులో ఉంటా యని ఎస్పీ మణికంఠ తెలిపారు. నగర ప్రజలతో పాటు వాహనదారులు సహకరించాలని కోరారు. ● లారీలు, ట్రక్కులు తదితర భారీ వాహనాలు నగరంలోకి రాకుండా రెడ్డిగుంట జంక్షన్ నుంచి ఇరువారం, కాణిపాకం, మురకంబట్టు, కట్టమంచి వై జంక్షన్, సాంబయ్య కండ్రిగ జంక్షన్ మీదుగా మళ్లించారు. ● వేలూరు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు రెడ్డిగుంట జంక్షన్ నుంచి ఇరువారం, కాణిపాకం, మురకంబట్టు, ఎల్‌జీబీ టవర్స్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు మళ్లించారు. ● పలమనేరు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను ఇరువారం జంక్షన్ నుంచి కాణిపాకం, మురకంబట్టు, ఎల్‌జీబీటవర్స్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకోవాలి.● పుత్తూరు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులను సాంబయ్యకండ్రిగ జంక్షన్ మీదుగా కట్టమంచి వై జంక్షన్, ఎల్‌జీబీ టవర్స్ మీదుగా ఎన్టీయార్ ప్రైవేటు బస్టాండ్‌కు మళ్లించారు. ● ప్రైవేటు బస్సులు వేలూరు మీదుగా వచ్చే వాహనాలకు రెడ్డిగుంట వరకు మాత్రమే అనుమతి ఉంది. ● పలమనేరు నుంచి వచ్చే ప్రైవేటు బస్సులకు ఇరువారం వరకు మాత్రమే అనుమతి ఉంది. ● కట్టమంచి నుంచి వేలూరు, పలమనేరు వైపు వెళ్లే కార్లు, ఆటోలు ఎల్‌జీబీ టవర్స్, ఆర్టీసీ బస్టాండ్, ఫారెస్టు రోడ్డు మీదుగా వెళ్లాలి. ● వేలూరు, పలమనేరు నుంచి కట్టమంచి వైపు వెళ్లేవారు ఫారెస్టు రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా వెళ్లాలి. ● చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి వెళ్లేవారు ట్రాఫిక్ దృష్ట్యా దర్గా జంక్షన్, చింతమానువీధి మీదుగా ఆస్పత్రికి చేరుకోవాలి.

వరసిద్ధుడి ఆలయంలో ఘనంగా చిత్రా పౌర్ణమి వేడుకలు

ఐరాల(కాణిపాకం), మే 13 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణి పాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి చిత్రా పౌర్ణమి సందర్భంగా వినాయకస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజులస్వామి వార్ల గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వ హించారు. వినాయకస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించి హారతులిచ్చారు. ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్ట ర్ రవి, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో కలెక్టర్ తనిఖీలు

పూతలపట్టు, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన పూతలపట్టు మండలం పి.కొత్త కోట ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వైద్యాధికారులు 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలనుంచి ఏమైనా ఫిర్యాదులు వస్తే చర్యలు తీసు కుంటానన్నారు. ఆస్పత్రి అభివృద్ధికి తమవంతు కృషిచేస్తానన్నారు. ఆస్పత్రికి 24 గంటలు కరెంట్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకో వాలని సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. కార్య క్రమంలో తహసీల్దార్ రమేష్, వైద్యాధికారులు, వైద్యసిబ్బంది, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ ఫ్లెక్సీ చింపివేత

గంగాధరనెల్లూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేతలు కొత్తగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు చింపేసిన విష యాన్ని మంగళవారం స్థానిక నేతలు గుర్తించారు. గంగాధరనె ల్లూరు మండలం పాపిరెడ్డిపల్లె పంచాయతీ పరిధిలో పాపిరెడ్డి పల్లె, పెదకంటిపల్లె గ్రామాల్లో ఈనెల 9వ తేదీన ప్రభుత్వవిప్ డాక్టర్ థామస్ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆ సందర్భంలో థామస్‌కు స్వాగతం పలుకుతూ పాపిరెడ్డిపల్లె నుంచి పెద్దకుంటప ల్లెకు వెళ్లే రహదారి పక్కన టీడీపీ నేతలు పోలు రుషేంద్రరెడ్డి, కామసాని ఉమేష్‌రెడ్డిల పేర్లతో ఫ్లెక్సీని ఏర్పాటుచేశారు. ఈ ఫ్లెక్సీని సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పూర్తిగా చింపేశారు. మంగళవారం ఉదయం టీడీపీ నేతలు తాము ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని చించేసి ఉండటాన్ని గుర్తించారు. దీంతో వారు గంగాధరనె ల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్ల రాక

గంగాధరనెల్లూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు మండల ఉపాధిహామీ కార్యాలయానికి ఇతర మండలాల నుంచి కొత్తగా ముగ్గురు టెక్నికల్ అసిస్టెంట్లు వచ్చి విధుల్లో చేరగా, ఇక్కడ పనిచేస్తున్న ముగ్గురు టెక్నికల్ అసిస్టెంట్లు ఇతర మండలా లకు బదిలీపై వెళ్లారు. చిత్తూరు మండలంలో టెక్నికల్ అసిస్టెం ట్‌గా పనిచేస్తున్న ఎం.నాగార్జున, పాలసముద్రం మండలంలో పని చేస్తున్న రంగనాథం, కార్వేటినగరం మండలంలో పనిచేస్తున్న ఈశ్వరకుమార్‌లు కొత్తగా గంగాధరనెల్లూరు మండలంలో విధుల్లో చేరారు. కాగా గంగాధరనెల్లూరు మండలంలో టెక్నికల్ అసిస్టెం ట్లుగా పనిచేస్తున్న గుణశేఖర్, గోపీ శ్రీరంగరాజుపురం మండలా నికి, విశ్వనాథం చిత్తూరు మండలానికి బదిలీపై వెళ్లారు.

వైసీపీ ప్రభుత్వంలోనే వ్యవస్థలు నాశనం

వెదురుకుప్పం, మే 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్ని వ్యవస్థలను నాశనం చేసి, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసేసి ప్రస్తుతం నీతులు చెప్పడం సిగ్గుచేటని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ థామస్ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. గంగాధరనె ల్లూరు నియోజకవర్గంలో అధికశాతం ఎస్సీ కుటుంబీకులు నివసి స్తున్నారని, రెండు పర్యాయాలు మంచి మెజారిటీతో గెలిపిస్తే ఆ వర్గాలకు ఏమి న్యాయం చేశారని నారాయణస్వామిని ప్రశ్నించారు. నాడు ఉప ముఖ్యమంత్రి పదవిలో కొనసాగిన మీరు చేపట్టిన అభి వృద్ధి పనులకు, తాను 11 నెలల వ్యవధిలో చేపట్టిన అభివృద్ధి కార్య క్రమాలపై చర్చా వేదికకు సిద్ధమా అంటూ థామస్ సవాల్ విసి రారు. చిల్లర రాజకీయాలు మానుకుని నియోజకవర్గ అభివృద్ధికి మంచి సలహాలు, సూచనలు అందించాలని, లేనిపక్షంలో చరిత్ర హీనుడిగా మిగిలిపోవడం ఖాయమని థామస్ హెచ్చరించారు.

పోక్సో చట్టంపై అవగాహన

పెనుమూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): కిశోరి బాలికలు ఆరోగ్యప రంగా పరిశుభ్రంగా ఉండాలని ట్రైనర్ అఫ్రీన్ అన్నారు. కిశోరి వికాసం వేసవి అవగాహన సదస్సుల్లో భాగంగా నాల్గవ రోజు మంగళవారం మండలంలోని చిప్పారపల్లి పంచాయతీలో 11 నుంచి 18 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన బాలికలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

● వెదురుకుప్పం: బాలల హక్కులు, రక్షణ చట్టాలు, పోక్సో చట్టంపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని కార్వేటినగరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శకుంతల తెలిపారు. మంగ ళవారం వెదురుకుప్పం మండలం బొమ్మనదొడ్ల అంగన్వాడీకేం ద్రంలో కిశోరి వికాసం సమ్మర్ స్పెషల్ క్యాంపులో భాగంగా బాలల హక్కులు, రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఎంఎస్‌కే, కిశోర బాలికలు పాల్గొన్నారు.

చెరువు కాల్వ ఆక్రమణలు తొలగించండి



డీటీ తులసీరామ్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు, టీడీపీ నేతలు

గంగాధరనెల్లూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): చెరువు కాల్వలో ఆక్రమణలు తొలగించాలని మండలంలోని పాపిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన పలువురు రైతులు, టీడీపీ నేతలు మంగళ వారం గంగాధరనెల్లూరు డిప్యూటీ తహసీల్దార్ తులసీరామ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాపిరెడ్డిపల్లె గ్రామానికి సమీపంలోని బయ్యారెడ్డి చెరువు నుంచి ఇరగమరెడ్డి చెరువుకు వచ్చే కాల్వను గ్రామంలోని కొందరు వ్యక్తులు ఆక్ర మించేశారని తెలిపారు. దీంతో వర్షం కురిసినప్పుడల్లా వర్షపునీరు చెరువులోకి వెళ్లకుండా పక్కనే ఉన్న రైతుల పొలాలపై పడి పంటలు నాశనం కావడమే కాకుండా, భూమి కోతకు గురై నష్టపోతున్నామని చెప్పారు. అదేవిధంగా పొలాల వద్దకు వెళ్లాలంటే దారి సౌకర్యం లేక ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. చెరు వు కాల్వకు సంబంధించి సర్వేనెంబర్లు 149, 151, 153, 156, 158, 161-1, 176 లలో సర్వేచేసి, హద్దులు చూపించినట్లయితే, ఆ కాల్వను శ్రమదానంతో బాగుచే సుకుంటామని రైతులు తెలిపారు.

చెర్లోపల్లిలో సోషియో ఎకానమిక్ సర్వే



చెర్లోపల్లిలో సర్వే నిర్వహిస్తున్న ఎస్వీయూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

చిత్తూరు రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని చెర్లోప ల్లిలో మంగళవారం ఎస్వీ యూనివర్శిటీకి చెందిన అగ్రిక ల్చర్ బీఎస్సీ విద్యార్థులు నిర్వ హిస్తున్న ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా రెండో రోజున సోషియో ఎకానమిక్ సర్వే నిర్వ హించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రైతుల ఇళ్లకు వెళ్లి వారు వేసిన పంటల గురించి సమగ్ర సమాచా రాన్ని సేకరించారు. సాయంత్రం రైతులకు వివిధ వ్యవసాయ సంబంధిత యాప్‌ల గురించి అవగాహన కల్పించారు. ఎస్వీ యూనివర్శిటీ ప్రొఫెసర్, ఎన్ఎ్ ఎఎస్ హెడ్ శైలజ, పీఆర్ ప్రశాంతి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులకు నష్టం చేకూర్చే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

చిత్తూరు రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు నష్టం చేకూర్చే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని ఏఐటీ యూసీ, సీఐటీయూ నాయ కులు డిమాండ్ చేశారు. మంగ ళవారం స్థానిక ఎస్టీయూ కార్యా లయంలో యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటీష్ కాలంలో పోరాడి సాధించుకున్న అనేక చట్టా లను, 44 లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి, వాటిని 4 కోడ్‌లుగా మార్చి పెట్టుబడిదారులకు కార్మికుల శ్రమను దోచిపెడుతుందని విమర్శించారు. ఇప్పటికైనా కార్మికులకు నష్టం చేకూర్చే లేబర్ కోడ్‌లను రద్దు చేసి, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 20వ తేదీన జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. యూనియన్ నాయకులు నాగరాజు, సరేంద్ర పాల్గొన్నారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



కోయిల్ ఆళ్వార్ తిరుమంజనంలో పాల్గొన్న టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ తదితరులు

వెదురుకుప్పం, మే 13 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు జర గనున్న నేపథ్యంలో మంగళ వారం కోయిల్ ఆళ్వార్ తిరు మంజనం ఘనంగా జరి గింది. ఇందులో భాగంగా గర్భాలయం, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డకర్పూర, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా సంప్రోక్షణ చేశారు. అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పె క్టరు సురేష్‌కుమార్, ఆలయ అర్చకులు రమేష్, శబరి, గోపాలాచారి, షరాబు బాబు సురేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బంగారమ్మకు విశేష అలంకరణ

వెదురుకుప్పం, మే 13 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం గ్రామ దేవత బంగార మ్మకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, హరిద్రవం, పసుపు, కుంకుమ అభిషేకం చేశారు. రాహుకాలం పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు.

గంగమ్మకు తొలిపూజలు



గంగమ్మతల్లికి హారతి ఇస్తున్న లోకేష్ రెడ్డి

పూతలపట్టు, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం గంగమ్మ జాతరను ఘనంగా జరుపుకు న్నారు. మహిళలు గ్రామ పొలిమేరల్లో చిన్నపాటి పందిళ్లు వేసి పొంగళ్లు పెట్టి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఎం.బండప ల్లిలో గ్రామస్థుల తొలిపూజతో గంగమ్మ జాతర అంగరంగ వైభ వంగా ప్రారంభమైంది. టీడీపీ యువనేత లోకేష్‌రెడ్డికి కార్యనిర్వా హకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం లోకేష్ రెడ్డి అమ్మవారికి హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. టీడీపీ నాయ కులు జయరామ్, కృష్ణమూర్తి, రెడ్డెప్పరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, లోకేష్, దయాకర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రాణంపల్లిలో..



పొంగళ్లు తీసుకెళుతున్న గ్రామస్తులు

పెనుమూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉగ్రాణంపల్లిలో వెలసిన ముత్తిగంగమ్మ జాతర వేడుకలు మంగళ వారం ఘనంగా జరిగాయి. గ్రామస్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. పెద్ద ఎత్తున పొట్టేళ్లను అమ్మవారికి బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మురళీకుమార్‌రెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ధనశేఖర్ రెడ్డి, ప్రవీణ్‌కుమార్, జగపతి, శివ, కనకరాజులురెడ్డి, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడికి స్వాగతం



నగరి, మే 13 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి తన 71వ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం తిరుమల వెళ్లారు. రోడ్డు మార్గంలో ప్రయాణించిన ఆయనకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వి.అంబ్రోస్ విల్సన్ నగరిలో స్వాగతం పలి కారు. అలాగే రాబోయే ఎన్నికల్లో మెజారిటీతో విజయం సాధిస్తా రని ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా రామాపురం, పుత్తూరు, రేణిగుంట ప్రాంతాల్లో అన్నాడీఎంకే కార్యకర్తలు ఆయ నకు స్వాగతం పలికారు. పార్టీ నాయకులు బాబు నాయుడు, గోవిందస్వామి, పండు, ముత్తువేల్ పాల్గొన్నారు.

మహేష్‌కు నివాళులు



గుడిపాల, మే 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వసంతాపురం గ్రామానికి చెందిన మహేష్ సోమవారం మృతి చెందగా, మంగళ వారం జీజేఎం ట్రస్టు నిర్వాహకులు చెన్నకేశవులు నాయుడు ఆయన మృతదేహానికి నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం గుడిపాల క్రాస్‌లో అనారోగ్యంతో మృతి చెందిన వెంకటేశ్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. టీడీపీ నేతలు బాబురెడ్డి, మధుసూదన్‌నా యుడు, మురళీ నాయుడు, తదితరులు ఉన్నారు.

అలరించిన కీచక వధ

గుడిపాల, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వసంతాపు రంలో గత 13 రోజులుగా నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా మంగళవారం కీచక వధ ఘట్టాన్ని హరికథా భాగవ తార్ వినయ్‌ప్రసాద్‌రెడ్డి ప్రజలకు కళ్లకు కట్టినట్లు వివరించారు. హరికథను వినేందుకు చుట్టుప్రక్కల గ్రామస్థులు హాజరయ్యారు.

బంగారమ్మకు ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం, మే 13 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం గ్రామ దేవత బంగారమ్మకు మంగళవారం విశేష పూజలు నిర్వహిం చారు. అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, హరిద్రవం, పసుపు, కుంకుమ అభిషేకం చేశారు. రాహుకాలం పూజలు, కుంకుమార్చ నలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త కొప్పేటి ప్రసాద్ పర్యవేక్షించారు.